ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు




SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 157 మంగళవారం 26 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 157 Tuesday 26 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# తెలంగాణలో మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా 8వేల మహిళ సంఘాల భవనాల శంకుస్థాపన కార్యక్రమం
- సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- మహిళల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి అవుతుందని వెల్లడి
- నాణ్యమైన ఉత్పత్తులకు వాటిని చిరునామాగా మార్చండని పిలుపునిచ్చారు
- 29 నెలల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకు రూ.10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించామని గుర్తు చేశారు



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 25 :**
తెలంగాణలో మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం మహిళా వారోత్సవాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళాశక్తి భవనాలకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అన్ని కలెక్టరేట్‌లలో మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి నిర్వహించారు. నాణ్యమైన ఉత్పత్తులకు వాటిని చిరునామాగా మార్చండని పిలుపునిచ్చారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్న రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. 29 నెలల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకు రూ.10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించామని గుర్తు చేశారు. - మిగతా 2 లో

## తెలంగాణ పల్లెలకు భారీ ఊతం
## రూ.9,968 కోట్లు కేటాయించిన కేంద్రం




- తెలంగాణ గ్రామీణ సంస్థలకు భారీగా నిధులు కేటాయించిన 16వ ఆర్థిక సంఘం
- ఐదేళ్ల కాలానికి రూ.9,968 కోట్ల మంజూరు
- ఈ నిధులను జీతాలకు కాకుండా కేవలం అభివృద్ధి పనులకే వినియోగించాలని ఆదేశం
- నిధుల ఖర్చులో పారదర్శకత, కఠిన పర్యవేక్షణకు మార్గదర్శకాల జారీ
- 80% నిధులు పంచాయతీలకు.. 20% మండల, జిల్లా పరిషత్‌లకు పంపిణీ

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 25 :**
తెలంగాణలోని గ్రామీణ స్థానిక సంస్థల బలోపేతానికి, అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2026-27 నుంచి 2030-31 వరకు ఐదేళ్ల కాలానికి రాష్ట్రానికి రూ.9,968 కోట్లను గ్రాంట్‌గా నిర్దేశించింది. ఈ నిధులను కేవలం గ్రామాల అభివృద్ధికి మాత్రమే - మిగతా 2 లో



## టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

- టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో బస్సులో భరోసా పథకం ప్రారంభం
- ప్రయాణికుల భద్రత కోసం అత్యాధునిక సీసీ కెమెరాల ఏర్పాటు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా శ్రీకారం
- తొలి దశలో 175 బస్సుల్లో నిఘా నేత్రాల అమరిక
- ఫలితాలను బట్టి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు సంస్థ ప్రణాళిక


**వార్త సంధ్య, హైదరాబాద్, మే 25 :**
ప్రయాణికుల భద్రతను పెంచే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక అడుగు వేసింది. 'బస్సులో భరోసా' పేరుతో సరికొత్త కార్యక్రమానికి - మిగతా 2 లో

## రోళ్లు పగిలే 'రోహిణి కార్తె' ప్రారంభం

- జూన్ 7 వరకు కొనసాగనున్న రోహిణి కార్తె
- మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యధికంగా ఉండనున్న ఎండ ప్రభావం
- అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిది




## యూపీ అసెంబ్లీ, సెక్రటేరియట్‌పై దాడికి ఉగ్రవాదుల కుట్ర!



- 'ఎర్రకోట' పేలుడు కేసు దర్యాప్తులో షాకింగ్ నిజాలు
- లఖ్‌నవూలో వరుస పేలుళ్లకు ఉగ్రవాదుల స్కెచ్
- రెక్కీ నిర్వహించిన ముష్కర డాక్టర్ల ముఠా
- ఎన్ఐఏ దర్యాప్తులో వెలుగు చూసిన నిజాలు

**వార్త సంధ్య,ఢిల్లీ, మే 25 :**
ఢిల్లీలోని ఎర్రకోట బాంబు పేలుడు కేసుపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చేసిన దర్యాప్తులో భయంకరమైన ఉగ్రకుట్ర వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీతో పాటు, జనాలు ఎక్కువగా తిరిగే పలు ప్రముఖ ప్రాంతాల్లో వరుస ఉగ్రదాడులు జరపడానికి నిందితులు ప్లాన్ చేసినట్లు అధికారిక వర్గాలు సోమవారం తెలిపాయి."ఈ ఉగ్రకుట్రలో భాగంగానే ఎర్రకోట పేలుడు నిందితులైన - మిగతా 2 లో

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ అసంతృప్తి

- గోదావరి పుష్కరాలపై రాజమండ్రిలో పవన్ సమీక్ష
- రూ. 8,600 కోట్ల పనులకు డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం
- వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో ముఖ్యమంత్రికి వివరించాలని ఆదేశం



**వార్త సంధ్య, అమరావతి, మే 25 :**
రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2027 గోదావరి పుష్కరాల సన్నద్ధత సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకకు ఇప్పటివరకు సరైన సన్నద్ధత కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.8,600 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులకు ఇప్పటికీ డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాగితాలపై ప్రణాళికలు కాకుండా క్షేత్ర స్థాయిలో పనులు కనిపించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో సీఎం చంద్రబాబుకు వివరించాలని - మిగతా 2 లో

## 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు




- ఫ్రాన్స్‌కు లేఖ సిద్ధం చేసిన భారత్!
- 114 రఫేల్ విమానాల కొనుగోలుకు ప్రతిపాదన
- దేశంలోనే 90 విమానాల తయారీకి ప్లాన్
- ఇప్పటికే రక్షణ దళాల్లో రఫేల్ సేవలు
- రక్షణ రంగంలో అతిపెద్ద ఒప్పందానికి ముందడుగు

# ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం


- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- టెక్నాలజీతో ఏపీని వేగంగా ముందుకు తీసుకెళతామన్న సీఎం చంద్రబాబు
- అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు నిర్ణయం
- 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వెల్లడి
- చిప్ నుంచి షిప్ వరకు తయారీపై దృష్టి సారించామని స్పష్టం



**వార్త సంధ్య, అమరావతి, మే 25 :**
టెక్నాలజీని అనుసంధానం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మెటా, అమెజాన్, జోహో వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని, యువతకు అపార అవకాశాలు సృష్టిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడలో జరిగిన 'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీపై ఆధారపడి ఉందని, దీన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా మారుస్తామని, క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తిని కూడా ఇక్కడే చేపట్టేలా చర్యలు - మిగతా 2 లో

## గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు

- మంత్రి అచ్చెన్నాయుడు
- కమీషన్ల కోసం జగన్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధించిందన్న అచ్చెన్నాయుడు
- నాకెంత.. నీకెంత అంటూ దోచుకున్నారని విమర్శ
- కూటమి ప్రభుత్వంలో రూ. 23 లక్షల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి



**వార్త సంధ్య, అమరావతి, మే 25 :**
గత జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించి, రాష్ట్ర అభివృద్ధిని పాతాళానికి తొక్కేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం చీపుర్లపాడులో రూ.10.51 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో ఉండగా 'నాకెంత.. నీకెంత' అంటూ దోచుకున్న ఆ 'గొడ్డలి పార్టీ'కి గత ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెప్పారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను ఆక్రమించుకోవాలని చూస్తే, కూటమి ప్రభుత్వం - మిగతా 2 లో

# సంపాదకీయం

## అగ్రజుల గుసగుసలు



రెండు సాధారణ దేశాల అధినేతలు కలిశారంటే వాణిజ్యం, వ్యాపారం, పరస్పర సహకారం, ఇచ్చిపుచ్చుకోవడాలు చర్చకొస్తాయి. ఒప్పందాలు కుదురుతాయి. కానీ రెండు అగ్రదేశాలు కలిశాయంటే పైకి కనబడే వాణిజ్య, వ్యాపారాదులతోపాటు గుట్టుచప్పుడు కాకుండా కుదిరే లాలూచీలుంటాయి. వారం రోజుల వ్యవధిలో మూడు అగ్ర రాజ్యాల మధ్య మంతనాలు సాగాయి. గతవారం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనా పర్యటనకొస్తే, ఈ బుధవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంతు. స్వల్ప వ్యవధిలో ఇలా ఇద్దరు అగ్రరాజ్యాధినేతలు రావటంవల్ల సహజంగానే చైనా స్థాయి అమాంతం పెరిగిపోయింది. పుతిన్ వచ్చిన సందర్భం సాధారణమైనది కాదు. ఆయనే చెప్పినట్టు 54 సంవత్సరాల క్రితం ఇదేరోజున అప్పటి చైనా అధినేత మావో జెడాంగ్ 'ప్రపంచ దేశాలన్నీ ఏకమై అమెరికా సామ్రాజ్యవాదంపై పోరాడాల'ని పిలుపునిచ్చారు. అప్పటికీ ఇప్పటికీ ప్రపంచం మారింది. పెట్టుబడి ఎగుమతిలో, దేశాలపై ఆర్థికంగా పట్టుబిగించటంలో, ఇరుగుపొరుగును చీకాకుపెట్టడంలో, కనిపించేదంతా తనదేనని ప్రకటించుకోవటంలో చైనా సైతం సామ్రాజ్యవాద పోకడలకు పోతోంది. మధ్యన 'సోషల్ సామ్రాజ్యవాదం' ముద్ర వేయించుకున్న సోవియెట్ యూనియన్ చీలికలూ, పేలికలై కుప్పకూలింది. అందులోని ప్రధాన భాగం రష్యా కూడదీసుకునే ప్రయత్నం చేస్తూ, గత వారసత్వాన్ని కొనసాగించటానికి ఆపసోపాలు పడుతోంది. ఇక అమెరికా పోకడలు దశాబ్దాలుగా అదే బాణీలో కొనసాగుతున్నాయి.గతవారం ట్రంప్‌కు లభించిన స్వాగత సత్కారాలన్నీ పుతిన్‌కు కూడా దక్కాయి. రెడ్‌కార్పెట్ పరచడం, సైనిక వందనం, కేరింతలతో పిల్లలు అభివాదం చేయడం వంటివన్నీ కనబడ్డాయి. అయితే స్వీయ ప్రయోజనాల రక్షణలో తమకెవరూ సాటిరారని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నిరూపించారు. ఏవేవో ఒప్పందాలు కుదిరాయని ట్రంప్ చెప్పటమే తప్ప చైనా వైపునుంచి గతవారం ఎలాంటి ప్రకటనలూ రాలేదు. ఇప్పుడు పుతిన్‌కు కూడా దాదాపు అదే అనుభవం ఎదురైంది. ఇంధన సర ఫరా కోసం 'పవర్ ఆఫ్ సైబీరియా 2' పేరిట రెండో పైప్‌లైన్ నిర్మాణానికి రష్యా సిద్ధపడినా, చైనా అందుకు సంబంధించి మరింత లోతుగా చర్చించాల్సి ఉందంటూ వాయిదా వేసింది. కాకపోతే తైవాన్ విషయంలో ట్రంప్‌కు 'రెడ్‌లైన్' హెచ్చరిక జారీ అయిన పద్ధతిలో పుతిన్‌కుఎవరికి వారు అవతలివారిని వేలెత్తి చూపడమే తప్ప, తమ తప్పులెరగరని ట్రంప్, పుతిన్‌ల పర్యటనలు నిరూపించాయి. హార్మూజ్ జలసంధి ప్రతిష్టంభన, ఇరాన్ యుద్ధం విషయంలో గతవారం అమెరికా, చైనాలు 'ఏకాభిప్రాయం' ప్రకటిస్తే... ఇప్పుడు చైనా, రష్యాలు సైతం అలాంటి స్వరమే వినిపిస్తున్నాయి. 'ఏకపక్ష వ్యవహారశైలి, ఆధిపత్యవాద ధోరణులు' ఉండరాదని కోరాయి. ప్రపంచం ఆటవిక న్యాయంలోకి దిగజారే ప్రమాదం కనబడుతోందని ఆందోళన వ్యక్తంచేశాయి. తరచిచూస్తే ఈ మూడు దేశాలూ జంకూ గొంకూ లేకుండా ఆధిపత్య ధోరణులు ప్రదర్శిస్తున్నాయి. అయినా గంభీరస్వరాలతో హితవు పలికే సాహసం చేస్తున్నాయి. అమెరికా సైన్యం వెనెజులా అధ్యక్షుణ్ణి భార్యా సమేతంగా చీకటిచాటున అపహరించుకు పోయింది. ఇరాన్ అగ్రనేతను ఇజ్రాయెల్‌తో కలిసి హత్య చేసింది. క్యూబాను కబళించటానికి కత్తులు నూరుతోంది. రష్యా నాలు గేళ్లుగా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉంది. దురాక్రమణకు దిగకపోయినా ఆసియా ఖండ దేశాల్లో చైనా కండబల ప్రదర్శన తక్కువేం కాదు.ఇప్పుడున్న పరిస్థితుల్లో పుతిన్‌కు చైనా అవసరమే ఎక్కువుంది. ఉక్రెయిన్‌ను తక్కువ అంచనా వేసి యుద్ధంలోకి దిగి, అది తీవ్రంగా దెబ్బతింది. పుతిన్ స్వీయభద్రతే ప్రమాదంలో పడింది. రష్యా కాల్పుల విరమణ ప్రతిపాదనకు అంగీకరించిన ఉక్రెయిన్... 'రష్యా తలపెట్టిన మే 9 విక్టరీ పెరేడ్ సజావుగా సాగటానికే' దీనికి అంగీకరించామంటూ ఎద్దేవా చేసింది. దానికితోడు 2008 తర్వాత తొలిసారి ట్యాంకులు, క్షిపణులు లేకుండా ఆ పెరేడ్ హడావుడిగా ముగిసింది. మొత్తానికి ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఆ రెండు దేశాల మాదిరిగా తనపై ఇంకా దురాక్రమణదారు ముద్రపడనందువల్లే ఈమాత్రం ప్రతిష్ఠయినా దక్కుతున్నదని చైనా గ్రహించి సవ్యంగా వ్యవహరిస్తే అదే పదివేలు!

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ అసంతృప్తి



**మొదటిపేజీ తరువాయి -** అధికారులను ఆదేశించారు.సరైన ప్రణాళిక లేకుండా ఒకే ఏడాదిలో 7 వేల పనులు హడావుడిగా చేస్తే నాణ్యత దెబ్బతింటుందని పవన్ హెచ్చరించారు. "పాడైపోయిన సిమెంట్‌తో పనులు చేసి ప్రమాదాలు జరిగితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది, స్పష్టమైన డేటా లేకుండా అడిగితే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వదు" అని స్పష్టం చేశారు. గత పుష్కరాల తొక్కిసలాట ఘటనలు పునరావృతం కాకుండా, ఆరు జిల్లాల్లోని 274 పంచాయతీల వరకు ఏర్పాట్లు విస్తరించాలని, గోదావరి కాలుష్య నివారణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశాన్ని త్వరలోనే కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, పుష్కరాల నిధుల సమీకరణలో పవన్ కల్యాణ్ ఆశాకిరణంలా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు

**మొదటిపేజీ తరువాయి -** అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి రూ.15 వేల కోట్లు మంజూరు చేయించి ఉక్కు పరిశ్రమను కాపాడారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో కేవలం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించామని, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టేందుకు పరిశ్రమల స్థాపన అవసరమన్న ఆయన... నియోజకవర్గ తాగునీటి సమస్యకు రూ.620 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లా ప్రజల 60 ఏళ్ల కల అయిన 'నేరడి బ్యారేజీ'ని 2029 నాటికి వంద శాతం పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## యూపీ అసెంబ్లీ, సెక్రటేరియట్‌పై దాడికి ఉగ్రవాదుల కుట్ర!



**మొదటిపేజీ తరువాయి -** డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షాహీన్ సయూద్‌లు హరియాణాలోని ఫరీదాబాద్ నుంచి లఖ్‌నవూకు వెళ్లారు. ముందే వేసుకున్న ప్లాన్ ప్రకారం 2025 ఆగస్టు 25 నుంచి 30 మధ్య వీరు లఖ్‌నవూలో రెక్కీ నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని కీలక భవనాలపై దాడులకు ప్లాన్ చేశారు. అందులో భాగంగా యూపీ అసెంబ్లీ, బాపు భవన్ (సివిల్ సెక్రటేరియట్)తో పాటు జనాలు భారీగా వచ్చే ఇమాంబరా, లాల్‌బాగ్, అమీనాబాద్ ప్రాంతాలపై ముజమ్మిల్ రెక్కీ నిర్వహించాడు. ఈ ప్రాంతాలు తమ ఉగ్రదాడులకు సరిగ్గా సరిపోతాయని నిందితులు భావించారు. ఈ భవన సముదాయాల సమీపంలో పేలుడు పదార్థాలతో నింపిన కారును పేల్చాలని వారు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు" అని ఓ ఎన్ఐఏ అధికారి తెలిపారు.

# ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం



**మొదటిపేజీ తరువాయి -** తీసుకుంటున్నామని ప్రకటించారు. యువత, విద్యాసంస్థలు ఈ నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు.రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నామని, విశాఖపట్నాన్ని ప్రపంచానికే డేటా సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. స్టీల్, అల్యూమినియం, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి కీలక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. పుట్టపర్తి నుంచి బెంగళూరు వరకు డిఫెన్స్ కారిడార్‌గా, రాయలసీమను రూ.40 వేల కోట్ల పెట్టుబడితో ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఐదో తరం ఫైటర్ జెట్ యుద్ధ విమానాల టెస్టింగ్ ఫెసిలిటీని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సూర్యలంక, గండికోట వంటి పర్యాటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు.ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన 'చిప్ టు షిప్' పిలుపునకు అనుగుణంగా రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, పరిశ్రమలు వాస్తవ రూపంలో కార్యకలాపాలు ప్రారంభించేలా చూస్తున్నామని, 'సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్' తమ ప్రభుత్వ విధానమని పునరుద్ఘాటించారు. గత 23 నెలల్లో నెలకు రూ.లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామని ఆయన వెల్లడించారు. ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. వ్యవసాయం తర్వాత అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల పాలసీలను తీసుకొచ్చామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తామని ప్రకటించారు. రాష్ట్రం నుంచి 100 యునికార్న్ సంస్థలను ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.అంతకుముందు, విజయవాడలో 4.4 ఎకరాల విస్తీర్ణంలో 1.45 లక్షల చదరపు అడుగుల స్థలంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇలాంటి మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లను నిర్మిస్తామని ఈ వేదికగా సీఎం హామీ ఇచ్చారు.

# 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు



**మొదటిపేజీ తరువాయి -** భారత వైమానిక దళాన్ని మరింత శక్తిమంతం చేసే దిశగా రక్షణ శాఖ కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన అధికారిక ప్రతిపాదన లేఖను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. రాబోయే కొన్నిరోజుల్లోనే దీన్ని ఫ్రాన్స్ ప్రభుత్వానికి పంపించనున్నట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి.ఈ భారీ రక్షణ ఒప్పందంలో భాగంగా దాదాపు 90 యుద్ధ విమానాలను 'మేకిన్ ఇండియా' కింద ఇక్కడే తయారు చేయనున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్, ఓ భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి వీటిని మనదేశంలోనే ఉత్పత్తి చేస్తుంది. మిగిలిన విమానాలను మాత్రం నేరుగా ఫ్రాన్స్ నుంచి ఎగిరివచ్చే (ఫ్లై-అవే) స్థితిలో దిగుమతి చేసుకుంటారు. మన లేఖకు ఫ్రాన్స్ స్పందించిన తర్వాత అధికారికంగా టెండర్ ప్రక్రియ ముందుకు సాగుతుంది.భారతదేశ రక్షణ అవసరాలకు సరిపోయేలా ఈ రఫేల్ విమానాల్లో కనీసం 50 శాతం మేర స్వదేశీ సాంకేతికత, విడిభాగాలనే ఉపయోగించాలని ఢిల్లీ గట్టిగా పట్టుబడుతోంది. ఈ రఫేల్ ఉత్పత్తి ప్రక్రియలో భారతీయ కంపెనీల పాత్రను మరింత విస్తృతం చేయాలని ఫ్రాన్స్‌ను కోరింది. భవిష్యత్తులో జరగబోయే రక్షణ సహకారాలు కేవలం కొనుగోళ్లకే పరిమితం కాకుండా, ఇరు దేశాలు కలిసి డిజైన్, అభివృద్ధి చేసేలా ఒప్పందాలు ఉండను న్నాయి.భారత వైమానిక దళంలో ఇప్పటికే 36 రఫేల్ యుద్ధ విమానాలు సేవలందిస్తున్నాయి. అలాగే నౌకాదళం కోసం మరో 26 రఫేల్-ఎమ్ విమానాల కొనుగోలు ప్రక్రియ కూడా నడుస్తోంది. ఇప్పటికే మనదేశంలో రఫేల్ విమానాలకు సంబంధించిన మెయింటెనెన్స్, శిక్షణ మౌలిక వసతులు ఉండటం వల్ల, మరిన్ని కొత్త విమానాలు వస్తే వాటి రవాణా, నిర్వహణ ఖర్చులు, పైలట్ల శిక్షణ వ్యయం భారీగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.ఈ కొనుగోలు ప్రతిపాదనకు 'డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్' ఇప్పటికే ప్రాథమిక క్లియరెన్స్ ఇచ్చింది. ఇప్పుడు పంపించబోయే లేఖకు ఫ్రాన్స్ నుంచి ధరలు, డెలివరీ సమయం, లాజిస్టిక్స్ మద్దతు వంటి వివరాలతో సమాధానం వస్తుంది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య తుది చర్చలు జరుగుతాయి. ఈ రక్షణ ఒప్పందంపై సంతకాలు చేయడానికి ముందు ప్రధాని నేతృత్వంలోని 'క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ' తుది ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

# మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తాం



**మొదటిపేజీ తరువాయి -** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాం ఇవ్వడం కొంతమందికి నచ్చలేదని ఆరోపించారు. మహిళలను బస్సులకు యజమానులు చేశామని, అంబానీ, అదానీ చేసే పెట్రోల్ వ్యాపారం మహిళలు కూడా చేయాలనే బంకులు పెట్టించామని అన్నారు.మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, బ్యాంక్ లోన్ల చెల్లింపులో నిర్మల్ జిల్లా మహిళా సంఘాలు మొదటి స్థానంలో ఉన్నాయని ప్రత్యేకంగా అభినంది ంచారు. బ్యాంక్ నుంచి రుణాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని, మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం గోడౌన్‌లకు స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. మహిళ దగ్గర నుంచే మిల్లర్లు వడ్లు తీసుకెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు.మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. మహిళా శక్తి సూపర్ బజార్‌లో మహిళలు పెట్టుబడి పెట్టాలని కోరారు. నాణ్యమైన ఉత్పత్తులకు మహిళా శక్తి సూపర్ బజార్‌లు చిరునామాగా మార్చండని తెలిపారు. సొంత చెల్లినే ఇంట్లో నుంచి వెళ్లగొడుతున్నారని, తాము మహిళలను ఆడపడుచుగా భావించి చీరలు పంచుతున్నామని, ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే ప్రజా ప్రభుత్వం కలకాలం ఉంటుందని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా 8వేల మహిళ సంఘాల భవనాల శంకుస్థాపన కార్యక్రమాన్ని సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క, సీతక్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. వర్చువల్‌గాస్వయం సహాయక సంఘాల మహిళలు, కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు."మహిళా సంఘాలు ఉత్పత్తుల గోడౌన్‌లకు స్థలాలు ఇస్తాం. బ్యాంక్ నుంచి రుణాలు ఇప్పించి మహిళలతో రైస్ మిల్లులు పెట్టించే బాధ్యత తీసుకుంటాం. మహిళా సంఘాలు రైస్ మిల్లులు, గౌడౌన్లు పెట్టుకోవడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుంది. దళారులు, వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని గుర్తించి ఇకపై మహిళా సంఘాల వద్దే వడ్లు భద్రపరుస్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాం ఇవ్వడం కొంతమందికి నచ్చలేదు. మహిళలను బస్సులకు యజమానులు చేశాం. అంబానీ, అదానీ చేసే పెట్రోల్ వ్యాపారం మహిళలు కూడా చేయాలనే బంకులు పెట్టించాం. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తాం. మహిళా శక్తి సూపర్ బజార్‌లో మహిళలు పెట్టుబడి పెట్టండి. నాణ్యమైన ఉత్పత్తులకు మహిళా శక్తి సూపర్ బజార్‌లు చిరునామాగా మార్చండి. ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే ఈ ప్రభుత్వం కలకాలం ఉంటుంది.

# తెలంగాణ పల్లెలకు భారీ ఊతం

# రూ.9,968 కోట్లు కేటాయించిన కేంద్రం





**మొదటిపేజీ తరువాయి -** వినియోగించాలని, జీతభత్యాలు, పెన్షన్ల కోసం వాడరాదని స్పష్టమైన, కఠినమైన నిబంధనలు విధించింది.గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, వీధి దీపాల వంటి ప్రజా సేవల కోసమే ఈ నిధులను ఖర్చు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పటిష్ఠమైన పర్యవేక్షణ విధానాలను ప్రవేశపెట్టింది. ప్రతి స్థానిక సంస్థ తమ ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. త్రైమాసిక, వార్షిక నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి, అక్కడి నుంచి కేంద్రానికి పంపాల్సి ఉంటుంది. ఆడిట్‌లో లోపాలుంటే సరిదిద్దాలని, అవకతవకలు రుజువైతే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.4,35,236 కోట్లను ఆర్థిక సంఘం కేటాయించింది. ఈ నిధులలో 80 శాతం నేరుగా గ్రామ పంచాయతీలకు, 10 శాతం మండల పరిషత్‌లకు, మరో 10 శాతం జిల్లా పరిషత్‌లకు అందజేస్తారు. ఏటా జూన్, అక్టోబర్ నెలల్లో రెండు విడతలుగా ఈ గ్రాంట్లను విడుదల చేస్తారు. అయితే, మొత్తం నిధుల్లో 20 శాతం కేటాయింపులు స్థానిక సంస్థల పనితీరుపై ఆధారపడి ఉంటాయి. పన్నుల వసూళ్లు, సొంత ఆదాయ వనరుల పెంపుదల వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.నిధుల విడుదల ప్రక్రియ కూడా స్పష్టంగా నిర్దేశించారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు చేరిన నిధులను పది పనిదినాల్లోగా స్థానిక సంస్థల ఖాతాలకు బదిలీ చేయాలి. మొదటి విడత నిధులు పొందాలంటే, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ వివరాలు, 2025-26 ఆడిట్ నివేదికలను సమర్పించాలి. ఎన్నికలు జరిగి, ప్రజాప్రతినిధులు ఉన్న సంస్థలకు మాత్రమే ఈ గ్రాంట్లు వర్తిస్తాయి. నిధుల వినియోగంపై గ్రామసభల్లో, పరిషత్ సమావేశాల్లో తీర్మానాలు చేసి, వాటిని ఇ-గ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయడం తప్పనిసరి.

## టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు




**మొదటిపేజీ తరువాయి -** శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బస్సుల్లో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తోంది. తొలి దశలో భాగంగా ఈ పైలట్ ప్రాజెక్టును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభించింది.ఈ పైలట్ ప్రాజెక్టు కింద ఆదిలాబాద్ రీజియన్‌లోని 175 బస్సుల్లో హైటెక్ నిఘా కెమెరాలను అమర్చారు. పోలీసు శాఖ సమన్వయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా బస్సుల్లోని దృశ్యాలను ఆర్టీసీ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తారు. బస్సుల్లో దొంగతనాలు, మహిళలపై వేధింపులు, పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలు, వృద్ధులకు ఈ వ్యవస్థ భరోసా కల్పించనుంది.ఈ కార్యక్రమంపై టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు సురక్షిత ప్రయాణాన్ని అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినుల రక్షణకు ఈ కెమెరాలు ఒక 'రక్షణ కవచం'లా పనిచేస్తాయని తెలిపారు. ఈ కెమెరాల ఏర్పాటుతో ప్రయాణికులకు భద్రత పెరగడంతో పాటు, సిబ్బంది పనితీరులో జవాబుదారీతనం కూడా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఆదిలాబాద్ జిల్లాలో అమలవుతున్న ఈ పైలట్ ప్రాజెక్టు ఫలితాలను సమీక్షించి, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్సుల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## రోళ్లు పగిలే 'రోహిణి కార్తె' ప్రారంభం



**మొదటిపేజీ తరువాయి -** తెలుగు పంచాంగం ప్రకారం నేటి (మే 25) నుంచి అత్యంత శక్తిమంతమైన 'రోహిణి కార్తె' ప్రారంభమైంది. జూన్ 7 వరకు కొనసాగే ఈ కాలంలో ఎండల తీవ్రత గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్య, వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన ఎండల వల్ల ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగి, వడగాలులు, ఉక్కపోత తీవ్రరూపం దాలుస్తాయి.ఈ కాలంలో శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గిపోయి డీహైడ్రేషన్, వడదెబ్బ, తీవ్ర అలసట వంటి ముప్పులు పొంచి ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ ప్రభావం అత్యధికంగా ఉంటుంది. కాబట్టి ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి. దాహం వేయకపోయినా తరచుగా మంచి నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి పానీయాలు తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చు. అలాగే పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువ ఉన్న పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి.

## కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో 138 దరఖాస్తులు

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 25( వార్తా సంధ్య) :** ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 138 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఇస్తూ, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చిన అర్జీలలో భూ సమస్యలు, పింఛన్లు, ఉపాధి, ధాన్యం కొనుగోళ్లు, కుటుంబ సమస్యలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్ , చీఎ గిరి, బాన్సువాడ, ఎల్లారెడ్డి ఆర్డీవోలు,గ్గా జజుూ చందర్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## కూలీ లైన్ సెక్టార్‌లో మహిళా వారోత్సవాలు

**పోషకాహారంపై తల్లులకు అవగాహన కార్యక్రమం -- ఫుడ్ స్టాల్ ఏర్పాటు**

**తల్లులు, బాలికల్లో పోషకాహారంపై అవగాహన పెంపు**

**జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని నిపుణుల సూచనలు**

**మహిళా వారోత్సవాల్లో భాగంగా న్యూట్రిషన్ కార్యక్రమాలు**

**ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రత్యేక చర్చ**

**అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో ఫుడ్ స్టాల్ ఏర్పాటు**

**కిశోర బాలికలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 25 (వార్త సంధ్య) :** కూలీలైన్ సెక్టార్ పరిధిలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు పోషకాహారం ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించి, న్యూట్రిషన్‌కు సంబంధించిన ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శారద మాట్లాడుతూ తల్లులు మరియు పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, ఇంటి వద్ద లభించే పోషక విలువలున్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, హబ్ టీమ్ సభ్యులు, సఖి టీమ్ ప్రతినిధులు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొని పోషకాహారం గురించి అవగాహన పొందారు.

## హైకోర్టు ఆదేశాలను తక్షణమే అమలు చేయాలి

**మ్యుటేషన్ ప్రక్రియలో ఆలస్యం చేస్తే అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తప్పవు**




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య)మే 25 :** తెలంగాణ హైకోర్టు డబ్ల్యు పి . నంబర్.30232 2024లో 16-02-2026న ఇచ్చిన స్పష్టమైన తీర్పు మేరకు బాచారం గ్రామంలోని సర్వే నెంబర్లు 93, 94, 95, 97 మరియు 99లలో గల మొత్తం 34 ఎకరాల 25 గుంటల భూమికి సంబంధించిన మ్యుటేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, " అనన్య ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్" పేరిట భూ రికార్డులు నమోదు చేయాలని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బొమ్మిడి అశోక్ రెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీఓ మరియు తహసిల్దార్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత రెవెన్యూ అధికారులకు సమగ్ర ప్రాతినిధ్య వినతి పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. సంస్థ 2017లో నమోదైన రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేసి పూర్తి స్వాధీనంలో కలిగి ఉందని పేర్కొన్నారు. అలాగే, సంస్థకు సంబంధించిన రిజల్యూషన్ ప్లాన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ , హైదరాబాద్ చట్టబద్ధంగా ఆమోదించినప్పటికీ, మ్యుటేషన్ దరఖాస్తులను ఎటువంటి కారణం లేకుండా పెండింగ్‌లో ఉంచడం పూర్తిగా చట్టవిరుద్ధమని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం పెండింగ్‌లో ఉన్న అన్ని మ్యుటేషన్ దరఖాస్తులను 60 రోజులలోగా పరిష్కరించి, ధరణి/భూ భారతి రికార్డుల్లో కంపెనీ పేరును పట్టాదార్‌గా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు స్పష్టమైన ఆదేశాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే, సంబంధిత అధికారులపై వ్యక్తిగతంగా కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ సందర్భంగా బొమ్మిడి అశోక్ రెడ్డి మాట్లాడుతూ, "న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అధికారులు గౌరవించి వెంటనే అమలు చేయాలి. చట్టబద్ధమైన హక్కులను కాలయాపన చేయడం తగదు" అని అన్నారు.

## వనస్థలిపురం లో మాంటెస్సోరి కేంబ్రిడ్జి ప్రీ స్కూల్ ఘనంగా ప్రారంభోత్సవం





**ఎల్బీనగర్, మే 24(వార్త సంధ్య ) :** వనస్థలిపురంలోని నూతనంగా ఏర్పాటు చేసిన కేంబ్రిడ్జ్ మాంటెస్సోరి ప్రీ స్కూల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మన్సురాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, వనస్థలిపురం మాజీ బిఆర్ఎస్ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం తాజా మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై నిర్వాహకులు మౌనిక హరినాథ్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రీ స్కూల్ విద్యేనని కేంబ్రిడ్జ్ మాశీటెస్సోరి ప్రీ స్కూల్ యాజమాన్యం పిల్లలకు ఆటలతో పాటు సృజనాత్మక విద్య అందించడం అభినందనీయమని కొనియాడారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, మానసిక వికాసం పెంపొందేలా విద్య బోధన ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తరగతి గదిలో ఆట వస్తువులు, ఆధునిక సౌకర్యాలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. స్కూల్ నిర్వాహకులు మౌనిక హరినాథ్ లు మాట్లాడుతూ.. ముందుగా ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సమగ్ర విద్య, సృజనాత్మకత, చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన ప్రీస్కూల్ విద్యను అందించేందుకు కేంబ్రిడ్జ్ మాన్టెస్సోరి ప్రీ స్కూల్ ప్రారంభించడం జరిగిందని వారు తెలిపారు. మాంటెస్సోరి అండ్ కేంబ్రిడ్జి కరికులం కార్యాచరణ ఆధారిత అభ్యాసం మైండ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ సురక్షితమైన అండ్ పిల్లలకు అనుకూలమైన క్యాంపస్, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సహాయక సిబ్బందిచే స్కూల్ నడిపిస్తున్నామని తెలిపారు. పిల్లలకు రవాణా సౌకర్యం కూడా అందుబాటులో ఉందని, పరిమిత అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని స్థానిక వాసులు తమ పిల్లలను తమ స్కూల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయగలరని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కాలనీ వాసులు, బంధుమిత్రులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో మానవత్వం మరిచిన ఘటన

**మృతదేహానికి కూడా దక్కని కనీస గౌరవం**

**భుజాలపై మోసుకెళ్లిన కుటుంబ సభ్యుల దుస్థితి చూసి కన్నీళ్లు**

**అంబులెన్స్ లేక ప్రభుత్వ వైద్య వ్యవస్థ వైఫల్యం బహిర్గతం**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానవత్వం ఎక్కడ..?**

**కలెక్టర్ ఆదేశాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయా..?**

**సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం**

**పేదల ప్రాణాలకు విలువ లేదా అంటూ మండిపాటు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 25 (వార్త సంధ్య) :** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చోటుచేసుకున్న హృదయ విదారక ఘటన ప్రజలను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. భద్రాచలం పట్టణానికి చెందిన ఓ వృద్ధుడు ఆసుపత్రిలో మృతి చెందగా, మృతదేహాన్ని ఇంటికి తరలించేందుకు కనీసం ఉచిత అంబులెన్స్ సౌకర్యం కూడా అందించకపోవడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని భుజాలపై మోసుకుంటూ వెళ్లాల్సిన దారుణ పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి అమానవీయ పరిస్థితులు నెలకొనడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెబుతుండగా, మరోవైపు మృతదేహాన్ని తరలించేందుకు కూడా సౌకర్యం కల్పించకపోవడం వైద్యశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు.

ఇటువంటి ఘటనలు గతంలో ఇతర రాష్ట్రాలలో జరిగినప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయని, ఇప్పుడు అదే పరిస్థితి మన ప్రాంతంలో చోటుచేసుకోవడం దురదృష్టకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్ తరచూ ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు, సకల సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రవర్తనలో మార్పు కనిపించకపోవడం విచారకరమని ప్రజలు అంటున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కామారెడ్డిలో మీడియా సమావేశం నిర్వహించిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

**కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు.**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 25 ( వార్త సంధ్య ) :** ఇటీవల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంపై ప్రశ్నించిన ఆయన, ఎమ్మెల్యేగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేసి సమీక్ష సమావేశం నిర్వహిస్తే బాగుండేదని వ్యాఖ్యానించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒక వెంచర్‌కు మూడు రోజుల వ్యవధిలోనే అనుమతులు మంజూరు చేయడంపై అనుమానాలు వ్యక్తం చేసిన చంద్రశేఖర్ రెడ్డి, నిజామాబాద్‌కు చెందిన వ్యక్తుల వెంచర్‌కు వేగంగా అనుమతులు ఇప్పించి స్వలాభం పొందారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలకు బెంచీలు పంపిణీ చేయడం వెనుక కూడా రాజకీయ ప్రయోజనాలున్నాయని విమర్శించారు. గత వర్షాకాలంలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్డు డివైడర్లను ఇప్పటివరకు పునర్నిర్మించలేదని ఆయన అన్నారు. అలాగే హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి తాను అన్ని వర్గాల వారితో చర్చిస్తూ కృషి చేస్తున్నప్పటికీ కొంతమంది సహకరించడం లేదని తెలిపారు. హిందువుల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులే హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆరోపించిన ఆయన, పది రోజుల్లో జిల్లా కలెక్టర్‌ను కలిసి అభివృద్ధి పనులకు అనుమతి కోరనున్నట్లు చెప్పారు. అవ సరమైతే అన్ని కుల సంఘాల నాయకులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అక్రమ కట్టడాలు పెరుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించడం లేదని విమర్శించారు. వారం రోజుల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే ఆ కట్టడాల వద్దనే మీడియా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల సమ యంలో తప్ప ఎమ్మెల్యే గ్రామాల వైపు వెళ్లిన సందర్భాలు లేవని కూడా ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో పిడుగు మమత సాయి బాబు, గడ్డమీది మహేష్, తాటి ప్రసాద్ లావణ్య, నర్సా గౌడ్, సలీం, చాట్ల వంశీ, రంగ రమేష్ గౌడ్, నర్సుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా మహిళా వారోత్సవాలు

**గర్భిణులతో వంటల కార్యక్రమం పోషకాహారంపై తల్లులకు అవగాహన**

**పిల్లల ఆరోగ్య పరిరక్షణపై తల్లులతో ప్రతిజ్ఞ**

**స్థానిక ఆహార పదార్థాలతోనే మంచి పోషణ**

**గర్భధారణ సమయంలో పౌష్టికాహారం తీసుకోవాలని సూచనలు**

**అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు ఆరోగ్య చైతన్యం**

**తల్లి -- శిశు ఆరోగ్యమే మహిళా వారోత్సవాల లక్ష్యం**

**పోషకాహార లోప నివారణపై అవగాహన కార్యక్రమం**

**కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాల వినియోగంపై చైతన్యం**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 25 (వార్త సంధ్య) :** రామవరం సెక్టార్ పరిధిలోని చిట్టి రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో 99 రోజుల "ప్రజా పాలన ప్రణాళిక"లో భాగంగా మహిళా వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామవరం సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీమతి పార్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా వారోత్సవాల సందర్భంగా గర్భిణీ స్త్రీలతో కలిసి ప్రత్యేక వంటల కార్యక్రమం నిర్వహించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రత్యక్షంగా వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడమే మహిళా వారోత్సవాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. అనంతరం తల్లులతో పిల్లల ఆరోగ్యం, సంరక్షణ, సరైన పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు మరియు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం తనను కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు గాను ఆయన ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ సీఎం రేవంత్ రెడ్డికి పూల బొకే అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.



**సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు:**

బండి రమేష్‌ను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్పొరేషన్ నిర్వహణ మరియు భవిష్యత్తు కార్యాచరణపై పలు కీలక సూచనలు చేశారు:

**ఐక్యత ఒ భాగస్వామ్యం:**

రాష్ట్రంలోని కమ్మ సంఘాలన్నింటినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చి, తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో వారిని భాగస్వామ్యం చేయాలని సూచించారు.

**పేదల అభ్యున్నతి:**

ఈ కార్పొరేషన్ ద్వారా సమాజంలోని పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి, వారిలో రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**పదవికి వన్నె తేవాలి:**

అప్పగించిన పదవికి మరింత గౌరవం పెరిగేలా, వన్నె తెచ్చేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

**ప్రభుత్వ పథకాల ప్రచారం:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. దీనికోసం అటు పార్టీ కార్యకర్తలను, ఇటు కార్పొరేషన్‌కు చెందిన వివిధ సంఘాల సభ్యులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సీఎం దిశా నిర్దేశం చేశారు.ఈ మర్యాదపూర్వక సమావేశంలో కమ్మ కార్పొరేషన్ డిప్యూటీ చైర్మన్ పరుచూరి మురళి (మరయ్య) తో పాటు పలువురు ముఖ్య నాయకులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అబద్ధాల ప్రభుత్వం.. హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లైనా కట్టారా?: కేటీఆర్, మాధవరం

**వార్తా సంధ్య కూకట్పల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తోందని, గడిచిన కాలంలో హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లైనా నిర్మించినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) సవాల్ విసిరారు. కూకట్పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం సోమవారం ఎన్కెఎన్ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగ ముందుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్, కేటీఆర్‌ల సహకారంతో కూకట్పల్లిని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. బాలానగర్, జేఎన్టీయూ, కైతలాపూర్ ఫ్లై ఓవర్లు, అండర్పాస్‌లు, వాటర్ ట్యాంకులు, ఎస్టీపీ ప్లాంట్లు, ఓపెన్ జిమ్‌లు, పార్కులు ఏర్పాటు చేసి నియోజకవర్గ రూపురేఖలు మార్చామన్నారు. బీఆర్ఎస్ హయాంలో నెలకు రూ.30 కోట్ల వరకు నిధులు మంజూరయ్యేవని, కానీ నేడు కనీసం నిధులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కట్టిన ఫ్లైఓవర్లను తామే కట్టామంటూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు.ప్రజెంటేషన్ అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ నమోదు, ఓట్ల తొలగింపు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై ప్రజలకు, కార్యకర్తలకు అర్థమయ్యేలా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ఓటు హక్కుపై ఏ విధంగా వివరించాలో దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో మాధవరం కృష్ణారావును గెలిపించిన కూకట్పల్లి కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని కొనియాడారు. భవిష్యత్తులోనూ లక్ష మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని కాపాడు కుంటామని, ప్రజల్లో ఉండి కష్టపడేవారికే రాబోయే కార్పొరేటర్ టికెట్లు దక్కుతాయని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ తిరిగి అధికారం లోకి రాగానే 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు, నిరంతర మంచి నీరు అందించే బాధ్యత తీసుకుంటామన్నారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంబిపూర్ రాజు, గజ్జల నాగేష్, రాగిడి లక్ష్మారెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరాతో పాటు మాజీ కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు, తూము శ్రావణ్ కుమార్, మేడ్చల్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.






## రామాజిపేట్ యాదవ సంఘం ఆధ్వర్యంలో
# ఘనంగా మల్లన్న స్వామి బోనాల పండుగ



**జగిత్యాల జిల్లా బ్యూరో మే 25(వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలలో బాగంగా సోమవారం మల్లికార్జున స్వామికి బోనాల పండుగ నిర్వహించారు. ఓగ్గుడోలు చప్పుల మధ్య,ఢమరుక మోతల నడుమ మల్లికార్జున స్వామి నామ స్మరణతో మహిళలు,గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి,ఊరేగింపుగా బోనాలను తీసుకు వచ్చి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు.వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు చేసి,ఆలయం ముందు మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శివసత్తులు పునకాలతో మల్లన్న పట్నాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వాసరి రవి యాదవ్,ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గురు మల్లారెడ్డి,వేల్పుల చిన్న నర్సయ్య,వార్డు సభ్యులు గోనె విష్ణు యాదవ్,మర్రి తిరుపతి యాదవ్,ఎటామ్ గంగారెడ్డి యాదవ్,గోనె బుచ్చ న్న యాదవ్, వేల్పుల స్వామి యాదవ్,బోయిని నరేందర్ యాదవ్,గడ్డం మల్లారెడ్డి యాదవ్,వేణు,మ్యకల రాజేష్, మహేష్,రాజం,కమలాకర్,తిరుపతి,భూమయ్య,మహేష్, యువ యాదవ యూత్, సంఘం సభ్యులు,మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో ఘనంగా
## ప్రారంభమైన కేంబ్రిడ్జ్ మాంటెస్సోరి ప్రీ స్కూల్



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 25:** చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్యతో పాటు సృజనాత్మక అభివృద్ధి కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కేంబ్రిడ్జ్ మాంటెస్సోరి ప్రీ స్కూల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, జీ.హెచ్.ఎం.సీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,కొప్పుల నర్సింహా రెడ్డి , మాజీ కార్పొరేటర్ లు జిట్ట రాజశేఖర్ రెడ్డి ,రాగుల వెంకటేశ్వర్ రెడ్డి హాజరై నిర్వాహకులు లతో కలిసి పాఠశాలను ఘనంగా ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు ఉత్తమ విద్యా ప్రమాణాలు అందించే దిశగా పాఠశాల ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అనంతరం అతిథులను ఘనంగా సన్మానం చేశారు.మాంటెస్సోరి, కేంబ్రిడ్జ్ విద్యా విధానాల ఆధారంగా రూపొందించిన ఈ విద్యాసంస్థలో కార్యాచరణ ఆధారిత బోధన, మైండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. పిల్లలకు అనుకూలమైన సురక్షిత వాతావరణంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్య అందించనున్నట్లు పేర్కొన్నారు.అదనంగా రవాణా సౌకర్యం, ఆధునిక తరగతి గదులు, చిన్నారుల మానసిక వికాసానికి తోడ్పడే ప్రత్యేక కార్యక్రమాలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ప్రస్తుతం పరిమిత అడ్మిషన్లు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాఠశాల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం లో నిర్వాహకులు ఎం డి, డైరెక్టర్ మౌనిక హరినాధ్, అకాడమిక్ కోఆర్డినేటర్ లక్ష్మి, విష్ణు ప్రియ,తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
## ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,మే 25:** బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో బి.ఎన్.రెడ్డి డివిజన్‌కు చెందిన పలువురు యువకులు ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పార్టీలో చేరిన యువకులకు పార్టీ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు.పార్టీలో చేరిన యువకులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మరియు కటికరెడ్డి అరవింద్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ సభ్యులు అనిల్ చౌదరి,ఉద్యమకారులు మాధవరం నరసింహారావు, గడ్డం మల్లేష్ గౌడ్,నక్క వెంకటస్వామి,అర్జున్ గౌడ్,మనోజ్ గౌరిశెట్టి,కొంగర మహేష్,కొంగర నరేష్ అలాగే పార్టీలో చేరిక అయిన యువకుల్లో సురేష్ రెడ్డి, కిరణ్ నేత మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు యువత పాల్గొన్నారు.

## జిమ్ మరియు పిల్లల ఆట పరికరాలను ఏర్పాటు చేసే స్థలాన్ని
## పరిశీలించిన బి.యన్ రెడ్డి మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 25:** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీ మరియు సచివాలయం నగర్ ఉమెన్స్ థీమ్ పార్క్ లో నూతన ఓపెన్ జిమ్ మరియు పిల్లల ఆట పరికరాలను ఏర్పాటు చేసే స్థలాన్ని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిమ్ పరికరాలు మరియు పిల్లల ఆటల పరికరాలలో నాణ్యత పాటించాలని. వీలైనంత త్వరగా పని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళ సభ్యురాలు వర్ధిని, వాణి మరియు ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో కలిసి కాలనీలో పర్యవేక్షించిన

**- మాజీ జి.హెచ్.ఎం.సి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 25:** ఉమ్మడి మన్సూరాబాద్ డివిజన్, హయత్ నగర్ కె.వి.ఎన్ రెడ్డి నగర్ కాలనీలో గత వారం రోజుల క్రితం నుండి కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజ్ పనులను మరియు శ్రీరామ్ నగర్ కాలనీలో నిర్మించాల్సిన నూతన ఇన్నర్ భూగర్భ డ్రైనేజీ లైన్లను మాజీ జి.హెచ్.ఎం.సి డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి జలమండలి ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన డి.జి.ఎం సాయినాథ్ గౌడ్ తో కలిసి పనులను పర్యవేక్షించి నూతనంగా నిర్మించాల్సిన లైన్లను ఎస్టిమేషన్ వేయించడం జరిగింది..ఈ సందర్భంగా నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజ్ కు సంబంధించిన నూతన లైన్లో నిర్మాణం కొరకు గత 6 నెల క్రితం ఎస్టిమేషన్ వేసిన పనులను తొందరగా టెండర్ కు పంపించు ఇన్నర్ లైన్లను పూర్తి చేయాలని, అదేవిధంగా డివిజన్లోని నూతనంగా ఏర్పడిన ఇంకా కొన్ని కాలనీలలో త్రాగునీటి పైప్లైన్ కూడా నిర్మించాల్సి ఉందని వాటికి సంబంధించిన ఎస్టిమేషన్ కూడా రెడీగా ఉన్నాయని జలమండలి ప్రధాన కార్యాలయంలో వచ్చిన అధికారులకు తెలియజేయడంతో వారు సానుకూలంగా స్పందించి తొందర్లోనే పనులను ప్రారంభిస్తామని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి నాగార్జున సందీప్,జె.టి.ఓ రాజేందర్, కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు ప్రమోద్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,బిజెపి నాయకులు నక్క రాజేష్ గౌడ్,కదారి యాదగిరి,జయతేజ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాల్లో జిల్లాలో 365 గ్రామ సంఘాల భవనాల భూమిపూజ, ప్రారంభోత్సవం






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 25 (వార్త సంధ్య ):** కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన ఈ-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణలో మహిళా వారోత్సవాల సందర్భంగా సోమవారం గ్రామ సంఘాల భవనాల భూమిపూజ, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ాజూదీ ఎన్వీ గిరి, ఐ=ఐూ దామోదర్ రెడ్డి, అదనపు ఐ=ఐూ విజయలక్ష్మి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రమిల, జిల్లా సమాఖ్య కోశాధికారి లక్ష్మి, కార్యదర్శి రాజమణి, మహిళా సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామ సంఘాల భవనాలు మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉపయోగపడ తాయని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో విజయ వంతంగా అమలు చేయాలని సూచించారు.జిల్లాలో ప్రస్తుతం 715 గ్రామ సంఘాలు , 16,998 మహిళా స్వయం సహాయక సంఘాలు, 468 దివ్యాంగుల సంఘాలు, 255 వృద్ధుల సంఘాలు, 305 కిశోర బాలికల సంఘాలు పనిచేస్తున్నాయని కలెక్టర్ వెల్లడించారు. మొత్తం 17,721 స్వయం సహాయక సంఘాలలో 1,80,951 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత కోసం జిల్లాలో 365 గ్రామ సంఘ భవనాలు, 24 ఆహార ధాన్య నిల్వ గోదాములు మంజూరయ్యాయని, ఇందుకు రూ.43.70 కోట్ల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ 2024 మార్చి 27న ప్రారంభమై విజయవంతంగా కొనసాగుతోందని, రూ.3 లక్షల పెట్టుబడితో ప్రారంభించిన ఈ క్యాంటీన్ ద్వారా 6 మంది మహిళలకు ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ప్రతి నెల రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు లాభాలు వస్తున్నాయని చెప్పారు. మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా జిల్లాలో మొత్తం 2,00,478 చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందులో 1,70,403 మంది ూాం+ సభ్యులు, 30,075 మంది ూాంట్టతర మహిళలు లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చిలకపచ్చ రంగు చీరలు అందించనున్నట్లు వెల్లడించారు.

ూాం+ సభ్యులలో 1,47,959 మంది, ూాంట్టతర సభ్యులలో 30,075 మంది వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రస్తుతం ాూూ, టైల్స్ పనులు జరుగుతున్నాయని కలెక్టర్ వివరించారు.మహిళా సంఘాల బలోపేతం, గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి, జీవనోపాధి అవకాశాల పెంపు కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# పంట వ్యర్థాలు కాల్చొద్దు - రైతులకు వ్యవసాయ శాఖ విజ్ఞప్తి

**డా. బి. గోపి, ఐఏఎస్ సంచాలకులు, వ్యవసాయ శాఖ, తెలంగాణ**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 25 :** రాష్ట్రంలో ఈ యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో వరి పంట సాగు జరిగిన నేపథ్యంలో ప్రస్తుతం వరి కోతలు దాదాపు పూర్తయ్యాయి. రాబోయే వానాకాల పంటల సాగు కోసం రైతులు భూములను సిద్ధం చేసు కుంటున్న తరుణంలో గత పంటకు సంబంధించిన అవశేషాలను తొలగించేందుకు అత్యంత సులభమైన మార్గంగా పంట వ్యర్థాలను కాల్చివేయడం జరుగుతున్నదని వ్యవసాయ శాఖ గమనించింది. అయితే పంట అవశేషాలను కాల్చడం వల్ల రైతులకు లాభాల కంటే అధిక నష్టాలు కలుగుతున్నాయని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. పంట వ్యర్థాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం పదార్థం దెబ్బతినడంతో పాటు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా నశిస్తాయి. దీని ప్రభావంతో భూసారం తగ్గి, భవిష్యత్‌లో రసాయన ఎరువులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అదేవిధంగా పంట వ్యర్థాల దహనం వల్ల గాలి కాలుష్యం పెరగడం, ప్రజల ఆరోగ్య సమస్యలు తలెత్తడం జరుగుతుంది. ముఖ్యంగా వేసవి కాలంలో మంటలు వేగంగా వ్యాపించి ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యర్థాల బహిరంగ దహనాన్ని పూర్తిగా నిషేధిస్తూ పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ జి.ఓ.ఎంఎస్ నెం.27 ప్రకారం కఠిన చర్యలు అమల్లో ఉన్నట్లు తెలియజేయబడింది. భూములపై, చెత్త మైదానాల్లో (ల్యాండ్‌ఫిల్ సైట్లలో) లేదా ఇతర ప్రదేశాలలో వ్యర్థాలను బహిరంగంగా కాల్చడం పూర్తిగా నిషేధించబడింది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పర్యావరణ పరిహార రుసుము విధించబడుతుంది. సాధారణంగా చెత్తను కాల్చినట్లయితే రూ.5,000/- పర్యావరణ పరిహారం విధించబడుతుంది. భారీ స్థాయిలో వ్యర్థాలను కాల్చినట్లయితే రూ.25,000/- పర్యావరణ పరిహారం విధించబడుతుంది.ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై చెత్తను బహిరంగంగా కాల్చకుండా సహకరించాలని విజ్ఞప్తి చేయబడుతుంది. పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం ద్వారా భూసారం మెరుగుపడటంతో పాటు సేంద్రియ కార్బన్ పెరుగుతుంది. తద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గి పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ సూచించింది. అలాగే వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని పేర్కొంది. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కొంతమంది రైతులు ఇప్పటికీ పంట వ్యర్థాలను కాల్చివేస్తున్నారని తెలిపారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాకు చెందిన రైతులు చాగర్ల చంద్రమౌళి, భాగ్యమ్మలు పంట వ్యర్థాలు కాల్చే క్రమంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన తీవ్ర విచారం కలిగించిందని తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో సంబంధిత జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు కిందిస్థాయి సిబ్బందికి మెమోలు జారీ చేయడం జరిగిందని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు డా. బి. గోపి, ఐఏఎస్ తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించి భూముల సారాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

# తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ లో కళాకారులకు పెండింగ్ బిల్లు చెల్లించండి.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 25 :** తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలియజేయునది, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులు కార్యక్రమాలు చేసి రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు బిల్లులు రాక కళాకారులు ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్య ఆవేదన వ్యక్తం చేశారు,

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ నుండి ఏదైనా కార్యక్రమం ఇచ్చినప్పుడు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన కళాకారులు వారి వారి సొంత ఖర్చులతో వచ్చి కార్యక్రమాలు చేసి, కళాకారులకు డబ్బులు వడ్డీకి తెచ్చి ఇవ్వడం జరుగుతుంది, కానీ 2024 సంవత్సరం నుండి ఇప్పటివరకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బిల్లులు మంజూరు చేయాలని ఆయన కోరారు, రేపు జరగబోయే తెలంగాణ అవతరణ దినోత్సవంలో కార్యక్రమం చేసిన వెంటనే

కళాకారులకు డబ్బులు వెంబటే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు, రెండు సంవత్సరాలు నుండి ఇబ్బంది పడుతున్న కళాకారులకు కాకుండా, ఆరు నెలల కింద ప్రోగ్రాం చేసిన వారికి బిల్లులు చెల్లించడం చాలా బాధాకరమని ఆయన అన్నారు, ఇప్పటికైనా సంబంధిత మంత్రి చొరవ తీసుకొని కళాకారులకు బిల్లులు చేయాలని ఆయన కోరారు,

# పౌష్టికాహారంతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యం : కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో , మే 25 (వార్త సంధ్య):** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాలు -- న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.పోషకాహార మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించిన కలెక్టర్, జిల్లాలోని ప్రాజెక్టుల ద్వారా ప్రదర్శించిన ఆహార పదార్థాలను రుచి చూశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ మహిళలకు ఇలాంటి పౌష్టికాహారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ప్రతి వారం ఒక్కో థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తూ విజయవంతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. మహిళా వారోత్సవాలను కూడా సమిష్టి కృషితో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాణ్యమైన, సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. గ్రామీణ మహిళల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించడంలో అంగన్వాడీ టీచర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు.అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనానికి మంచి ఆహారం ఎంతో అవసరమని, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.మహిళా వారోత్సవాల సందర్భంగా న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్, వంటల పోటీలు నిర్వహించారు. తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లతో తయారుచేసిన పౌష్టికాహార పదార్థాలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వంటల పోటీల్లో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, పీడీ డీఆర్‌డీఓ/డీడబ్ల్యూఓ శ్రీలత, సీపీఓ సౌమ్య, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, పీడీ మెప్మా, సీడీపీఓ శాంతికుమారి, వివిధ ప్రాజెక్టుల సీడీపీఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, డీడబ్ల్యూఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# రవీంద్రభారతిలో ఘనంగా "బెస్ట్ ఎన్జీవో ఆఫ్ ది ఇయర్ - 2026" అవార్డు ప్రదానం




**హైదరాబాద్, మే 25 (వార్త సంధ్య):** తెలంగాణ సమాజంలో సమాచార హక్కు చట్టం-2005 అమలు, పౌర హక్కుల పరిరక్షణ, పారదర్శకత కోసం కృషి చేస్తున్న "సమాచార హక్కు చట్టం సాధన కమిటీ (ాంజూజ)"కి ప్రతిష్టాత్మక "బెస్ట్ ఎన్జీవో ఆఫ్ ది ఇయర్ - 2026" అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఘనంగా అందజేశారు.సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి మరియు కమిటీ ముఖ్య ప్రతినిధులు ఈ అవార్డును స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జాతీయ, రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయి కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో కార్యక్రమానికి హాజరై ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. అవార్డు ప్రదానం అనంతరం రవీంద్రభారతి ప్రాంగణం సభ్యుల హర్షధ్వానాలతో మార్మోగింది. ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, "ఈ అవార్డు సమాజంలో మనం తీసుకొస్తున్న మార్పుకు, ప్రజాసేవ పట్ల మన నిబద్ధతకు దక్కిన గుర్తింపు. కమిటీ సభ్యుల నిరంతర శ్రమ, సేవాభావం వల్లే ఈ గౌరవాన్ని అందుకున్నాం. ఈ పురస్కారం భవిష్యత్తులో మరింత బాధ్యతతో పని చేయాలని మాకు ప్రేరణనిస్తోంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కడమంచి అజయ్ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు అరవింద స్వామి, బాపయ్య, బోగం విష్ణు, ముచ్చర్ల మల్లేష్, మూల జితేందర్ రెడ్డి, గుడ్డేటి ప్రవీణ్, దీపక్ కులకర్ణి, శ్రవణ్, రేపాక కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

**పదిరోజుల్లో నాలుగోసారి**

**దేశవ్యాప్తంగా మరోసారి భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు**

**లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున పెంపు**



దేశ ప్రజలకు మరోసారి ఇంధన ధరల షాక్ తగిలింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు సోమవారం పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచాయి. పెట్రోల్‌పై లీటరుకు రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు అమల్లోకి తీసుకొచ్చాయి. కేవలం పదిరోజుల్లోనే నాలుగోసారి ఇంధన ధరల పెంపు కావడం గమనార్హం. మే 15 నుంచి ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు దాదాపు రూ.7.5 వరకు పెరిగాయి.

**కీలక నగరాల్లో ధరలు ఇలా!**

**రాష్ట్ర ప్రభుత్వాల స్థానిక పన్నుల కారణంగా ధరల్లో ప్రాంతాలవారీగా తేడాలు ఉంటున్నాయి.**

**ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ ధర రూ.95.20**

**హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74**

**విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ ధర రూ.104.88**

**ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర రూ.111.21, డీజిల్: రూ.97.83**

**కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.51, డీజిల్ ధర రూ.99.82**

**చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.77, డీజిల్ ధర రూ.99.55**

**రెండు వారాల్లో నాలుగు సార్లు పెంపు**

నాలుగేళ్ల తర్వాత తొలిసారిగా మే 15న ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3 చొప్పున పెంచాయి. ఆ తర్వాత మే 19న లీటరుకు 90 పైసలు, మే 23న పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెంచారు. ఇప్పుడు మరోసారి భారీ పెంపు అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు 2022 మే తర్వాత అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ధరలు దాదాపు స్థిరంగానే కొనసాగగా, 2024 మార్చిలో సాధారణ ఎన్నికలకు ముందు లీటరుకు రూ.2 తగ్గించారు. ఇప్పుడు వరుస పెంపులతో సామాన్యులపై భారీ భారం పడుతోంది.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం, రూపాయి బలహీనపడటం, రిఫైనింగ్ ఖర్చులు అధికమవడం వల్ల దిగుమతి వ్యయం పెరిగిందని చమురు సంస్థలు చెబుతున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ ఉద్రిక్తతలు పెరగడం, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాలో అంతరాయాలు ఏర్పడటం వల్ల ఫిబ్రవరి చివరి నుంచి ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు 50 శాతం కంటే ఎక్కువ పెరిగినట్లు సమాచారం.పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నప్పటికీ గత కొన్ని నెలలుగా ప్రభుత్వ రంగ సంస్థలు వినియోగదారులపై భారం వేయకుండా ధరలను నిలిపివేశాయి. అయితే ప్రతిపక్షాలు మాత్రం కీలక రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకు కేంద్ర ప్రభుత్వం ధరల పెంపును ఆలస్యం చేసిందని ఆరోపిస్తున్నాయి. మే 15న జరిగిన మొదటి పెంపు, బీజేపీ పలు రాష్ట్రాల ఎన్నికల్లో విజయాలు సాధించిన వెంటనే రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.ప్రభుత్వ రంగ సంస్థల ధరల పెంపును ప్రైవేట్ చమురు కంపెనీలు కూడా అనుసరిస్తున్నాయి. నయారా ఎనర్జీ, షెల్, జియో-బీపీ వంటి సంస్థలు కూడా తమ పెట్రోల్ బంకుల్లో ధరలను పెంచాయి. నయారా ఎనర్జీ ఇప్పటికే మార్చిలో పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 పెంచగా, షెల్ ఏప్రిల్ 1 నుంచి పెట్రోల్‌పై రూ.7.41, డీజిల్‌పై రూ.25 వరకు పెంపు చేసింది.తాజా ధరల పెంపుతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడనుంది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలూ పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్, వ్యవసాయ రంగాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొన్ని నగరాల్లో సీఎన్‌జీ, పీఎన్‌జీ ధరలు కూడా పెరగడంతో గృహ ఖర్చులు మరింత పెరిగే పరిస్థితి ఏర్పడింది.

# 6 నెలలుగా రెక్కీ, గతంలో పలుమార్లు ఫెయిల్


**ఈసారి పక్కా ప్లానింగ్‌తో న్యాయవాది మొహిజుద్దీన్ హత్య**

**మొహిజుద్దీన్ హత్య సుపారీ గ్యాంగ్ పనేనన్న పోలీసులు**

**ఐదుగురు సభ్యులు దారుణానికి తెగబడినట్టు గుర్తింపు**

**కవాడిగూడకు చెందిన వినయ్‌కు రూ.10 లక్షలకు సుపారీ**

**నెలల పాటు న్యాయవాది ఇంటివద్ద రెక్కీ**



హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన హైకోర్టు న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. న్యాయవాది హత్యకు ముందే సుపారీ గ్యాంగ్ 10 లక్షలు తీసుకున్నట్లు గుర్తించారు. ఐదుగురు సభ్యుల ముఠా హత్యకు పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నలుగురు నిందితులు గోవాకు పరారయ్యారనే సమాచారంతో గాలింపు చర్యలు చేపట్టారు.రాష్ట్ర రాజధానిలో సంచలనం రేకెత్తించిన వక్ఫ్ బోర్డు ప్యానల్ న్యాయవాది, మాసబ్ ట్యాంక్‌కు చెందిన ఖాజా మొహిజుద్దీన్ హత్య సుపారీ గ్యాంగ్ పనే అని తెలుస్తోంది. ఐదుగురు సభ్యులున్న ముఠా దారుణానికి తెగబడినట్టు, ఇందుకోసం కిషన్ అనే వ్యక్తి కవాడిగూడకు చెందిన వినయ్‌కు 10 లక్షలకు సుపారీ ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. వీరు కొన్నినెలల క్రితమే న్యాయవాది హత్యకు పథక రచన చేసినట్లు సమాచారం. న్యాయవాది ఇంటి వద్ద పలుమార్లు రెక్కీ నిర్వహించి విఫలమై ఈ దఫా పక్కా ప్రణాళికతో ముఠా సభ్యులను రంగంలోకి దింపినట్లు గుర్తించారు. న్యాయవాది హత్య కోసం నిందితుడు వినయ్ సెకండ్ హ్యాండ్ కారు కొన్నట్లు సమాచారం. నిత్యం మొహిజుద్దీన్ కదలికలను గమనిస్తూ గురి తప్పకుండా ఢీకొట్టేలా రెక్కీ చేసినట్టు తెలిసింది.మూడు రోజులుగా శాంతినగర్‌లోని న్యాయవాది నివాసప్రాంతంలో నిందితులు కారు పార్కు చేసి రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. శనివారం తెల్లవారుజామున ఆయన స్విమ్మింగ్‌కు వెళ్లేందుకు కారు వద్దకు వచ్చి డోర్ తీస్తుండగా వెనుకవైపు నుంచి వేగంగా ఢీకొట్టారు. హత్యకు ఉపయోగించిన కారును ఆరు నెలల క్రితమే కొనుగోలు చేసినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తిలో వినయ్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మిగిలిన మరో నలుగురు నిందితులు గోవా పారిపోయినట్లు సమాచారంతో వారి కోసం పోలీసు బృందాలు అక్కడకు వెళ్లి గాలిస్తున్నాయి. వక్ఫ్ ఆస్తులను ఆక్రమించి విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన వివాదంపై న్యాయవాది మొహిజుద్దీన్ న్యాయపోరాటం చేస్తున్నారు. కొన్నేళ్లుగా దీనికి సంబంధించి చోటుచేసుకున్న వివాదాలే హత్యకు ప్రధాన కారణమని పోలీసులు అంచనాకు వచ్చారు. న్యాయవాది కుమారుడు ఫర్హాన్ ఇచ్చిన ఫిర్యాదుతో ముజాహిద్ ఆలం ఖాన్, మహబూబ్ ఆలం ఖాన్‌లపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెంగళూరులో ఉన్న వీరిద్దరినీ హైదరాబాద్ రప్పించి వివరాలు రాబట్టారు. నిందితులకు పోలీసులు రాచమర్యాదలు చేస్తున్నారని న్యాయవాది కుమారుడు ఫర్హాన్, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్‌హుస్సేన్‌లు ఆరోపించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో ఆధారాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకుని దాని యజమాని కోసం ఆరా తీస్తున్నారు. ఆరు నెలల క్రితమే విక్రయించినా కారు రిజిస్ట్రేషన్ చేయకపోవటంపై వివరాలు రాబడుతున్నారు.

# హైదరాబాద్ ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని దాటేందుకు కొత్త పరిష్కారాలు

**రూ.7 వేల కోట్లతో సమస్యకు పరిష్కారం**

**ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అధ్యయనం**

**లక్ష ఈ-బైక్‌లను అందుబాటులోకి తీసుకురావాలని సూచన**

**బైక్ షేరింగ్ వ్యవస్థను నిర్మించాలని వెల్లడి**



ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఇంటర్నేషనల్ లెవల్‌లో దూసుకుపోతున్న హైదరాబాద్ ప్రజారవాణా, రోడ్డు మౌలిక వసతుల విషయంలో మాత్రం తీవ్ర వెనకబాటుకు గురవుతోంది. సిటీ రవాణా రంగాన్ని ప్రక్షాళన చేసి ప్రపంచ స్థాయికి చేర్చడానికి గల అవకాశాలపై లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణకు చెందిన ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్-ఎఫ్‌డీఆర్ అనే స్వచ్ఛంద అధ్యయనం చేసి పలు పరిష్కారాలను తెలిపింది.హైదరాబాద్ మహానగరంలో ప్రతి సైకిల్‌కు రూ.20 వేల చొప్పున రూ.200 కోట్లతో లక్ష ఈ-బైక్‌లను అందుబాటులోకి తీసుకురావాలి. షాంఘై (11 లక్షల బైకులు), న్యూయార్క్ (35వేల బైకులు) తరహాలో హైదరాబాద్‌లోనూ బైక్ షేరింగ్ వ్యవస్థను పకడ్బంధీగా నిర్మించాలి.మెట్రో, బస్ స్టేషన్ల నుంచి వేర్వేరు కాలనీలకు కనెక్టివిటీ ఇచ్చేలా విద్యుత్తు ద్విచక్రవాహనాలు, ఈ-ఆటో సర్వీసులను ప్రైవేటు భాగస్వామ్యంతో విస్తరించాలి.కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ ప్రమాణాల ప్రకారం లక్షమందికి 60 ప్రజా రవాణా బస్సులు ఉండాలి.హైదరాబాద్‌లో ప్రతి లక్ష జనాభాకు కేవలం 28 బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. బొగోటా(130), సింగపూర్(99), న్యూయార్క్(85) నగరాలతో పోల్చితే ఇది చాలా తక్కువ.ఇక్కడ ప్రజా రవాణాను బలోపేతం చేయాలంటే మరో 3,200 కొత్త బస్సులను తక్షణమే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిందే.అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నగరాల్లో రోడ్ల విస్తీర్ణంలో ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లకు ఎక్కువ భాగాన్ని కేటాయిస్తారు. లండన్, సింగపూర్ వంటి నగరాల్లో నాన్-మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్టు వాటా 30 శాతానికిపైగా ఉంటే మన దగ్గర మాత్రం 5 శాతంలోపే ఉంది.ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు, రోడ్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలు వేర్వేరు శాఖల పరిధిలో కేంద్రీకృతమై ఉన్నాయి. కమ్యూనికేషన్ లోపంతో సిగ్నల్ వ్యవస్థలు, బస్‌బేల నిర్మాణం, మెట్రోస్టేషన్ల వద్ద కనెక్టివిటీ పరిస్థితులు గందరగోళంగా మారాయి. లండన్‌లో మాదిరి ఏకీకృత(ఇంటిగ్రేటెడ్) సంస్థే దీనికి ఏకైక మార్గం.ఒకే కార్డుతో ప్రయాణికుడు ఆర్టీసీ బస్సు, మెట్రో రైలు, ఆటోలు, ఈ-బైక్ షేరింగ్ వ్యవస్థ ఇలా వేటికైనా వాడుకునే టెక్నాలజీని తీసుకువచ్చి కనెక్ట్ చేయాలి. రాష్ట్ర సగటు 8 రోజుల వ్యయంతో సమానమైన రూ.7 వేల కోట్ల నిధులను హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థపై పెట్టుబడిగా పెడితే రాబోయే దశాబ్దాల కాలం పాటు రాజధాని నగరంలో రవాణా కష్టాలు తీరడమే కాకుండా కాలుష్య రహిత గ్లోబల్ సిటీగా అవతరిస్తుందని ఎఫ్‌డీఆర్ తన అధ్యయనంలో స్పష్టంగా తెలిపింది.

3,200 కొత్త బస్సులు రూ.4,800 కోట్లు

ఆధునిక ఫుట్‌పాత్‌లు రూ.2 వేల కోట్లు

లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం ఈ-సైకిళ్లు - రూ.200 కోట్లు

ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులో వంతెనలు : తీవ్రమైన ట్రాఫిక్ సంభవించే ప్రాంతాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ పథకంలో భాగంగా దాదాపు 40 పైచిలుకు ఫ్లైఓవర్‌లను నిర్మించింది. ఇందులో 35 కు పైగా అందుబాటులోకి వచ్చి వాహనదారుల సమయాన్ని ఆదా చేస్తున్నాయి. వీటి కోసం ప్రత్యేక నిధుల కింద మున్సిపల్ శాఖకు రూ.5 వేల కోట్లను కేటాయించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని స్టీల్ బ్రిడ్జి, ఎల్బీనగర్ వంటి జంక్షన్‌లలో నిర్మించిన ఫ్లైఓవర్‌లు ఈ పథకం కింద నిర్మించినవే. గతంలో కంటే ప్రస్తుతం ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా వాహనాదురులు సాఫీగా వెళ్లిపోతున్నారు.

# సతీసమేతంగా కాలినడకన తిరుమల చేరుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**కాలినడకన తిరుమల చేరుకున్న రామ్మోహన్ నాయుడు దంపతులు**

**అలిపిరి మెట్ల మార్గంలో ఈరోజు ఉదయం**

**11 గంటలకు నడక ప్రారంభం**

**1000 మెట్లకు పైగా బొట్లు పెడుతూ**

**కొండపైకి వచ్చిన కేంద్రమంత్రి**



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దంపతులు కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. కుమారుడు శివాన్ ఎర్రన్నాయుడి పుట్టువెంట్రుకల మొక్కు సందర్భంగా సతీమణి శ్రావ్యతో కలిసి శ్రీవారి దర్శనానికి వచ్చారు. అలిపిరి మెట్ల మార్గంలో ఉదయం 11 గంటలకు నడక ప్రారంభించిన రామ్మోహన్‌నాయుడు దంపతులు మధ్యాహ్నం 2 గంటలకు కొండపైకి చేరుకున్నారు. సతీమణితో కలిసి 1000 మెట్లకు పైగా బొట్లు పెడుతూ రామ్మోహన్‌నాయుడు కొండపైకి వచ్చారు.ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ నడకదారిలో వెళ్లే భక్తులకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. తిరుమలలోని సదుపాయాలే కూటమి ప్రభుత్వ పనులకు ఉదాహరణ అని చెప్పారు. ఏపీలో సనాతన ధర్మవ్యాప్తికి, సంప్రదాయాల పరిరక్షణకు విశేష కృషి జరుగుతోందన్నారు. శ్రీవారిని రామ్మోహన నాయుడు కుటుంబసభ్యులు సోమవారం దర్శించుకోనున్నారు.కుటుంబం సమేతంగా ప్రధాని మోదీ కలిసిన రామ్మోహన్ నాయుడు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కుటుంబసభ్యులతో శనివారం ప్రధాని మోదీని కలుసుకున్నారు. తల్లి విజయకుమారి, సతీమణి శ్రావ్య, కుమార్తె మిహిర, కుమారుడు శివాంగ్ ఎర్రన్నాయుడులను వెంటబెట్టుకొని ఢిల్లీలోని ఇక్కడి సేవాతీర్థ్‌లో ప్రధానిని కలిశారు. 20 నిమిషాలపాటు సాగిన భేటీలో రామ్మోహన్‌నాయుడు ప్రధానికి పొందూరు ఖాదీ, అరసవల్లి సూర్యనారాయణస్వామి విగ్రహం అందజేశారు.

# కొత్త నంబర్ నుంచి వాట్సప్‌కి వెడ్డింగ్ ఇన్విటేషన్ వచ్చిందా

**చెక్ చేయకుండా ఓపెన్ చేశారో అంతే సంగతులు!**

**కొత్త మోసాలకు తెరలేపుతున్న సైబర్ నేరగాళ్లు**

**వెడ్డింగ్ ఇన్విటేషన్, ఫ్రీ సినిమాల పేరిట ఏపీకే ఫైల్స్ పంపించి టోకరా**

**లింకులు, ఫైళ్లు డౌన్‌లోడ్ చేస్తే సైబర్ నేరస్థుల అధీనంలోకి ఫోన్**



సైబర్ నేరగాళ్లు ప్రతిరోజు టెక్నాలజీని ఉపయోగిస్తూ రెచ్చిపోతున్నారు. ఏదో రీతిన మోసం చేయడమే పనిగా పెట్టుకుని ప్రజల డబ్బును కాజేయడమే లక్ష్యంగా చెలరేగిపోతున్నారు. స్మార్ట్‌ఫోన్లు ఉపయోగిస్తున్న వారే సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకుని రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. మొన్నటి వరకు యాప్‌లు, ఉద్యోగాలు, బ్యాంకుల పేరిట నేరాలకు పాల్పడిన సైబర్ క్రిమినల్స్ తాజాగా పెళ్లిల సీజన్ రావడంతో మ్యారేజ్ ఇన్విటేషన్ పేరితో గాలం వేసేందుకు రెడీ అవుతున్నారు. సోషల్ మీడియా, వాట్సప్ ద్వారా ఏపీకే వెడ్డింగ్ కార్డ్ లింక్‌లు వస్తాయి. పొరపాటుగా ఆ పెళ్లి తేదీ తెలుసుకుందామని ఆసక్తితో ఆ లింక్‌పై క్లిక్ చేశారో ఇంక అంతే సంగతులు. ప్రస్తుతం నేరగాళ్లు ఈ తరహా మోసాలు చేసేందుకు సిద్ధమయ్యారు.నేరగాళ్లు వాట్సప్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియాల ద్వారా మ్యారేజ్ ఇన్విటేషన్ ఏపీకే, వెడ్డింగ్ కార్డ్ ఏపీకే లింక్‌లు వస్తాయి. కొన్ని సందర్భాల్లో బంధుమిత్రుల నంబర్ల నుంచి వచ్చినట్టు భ్రమ కల్పిస్తారు. ఆహ్వాన పత్రికను చూద్దామనే లింక్‌పై క్లిక్ చేయగానే ఏపీకే ఫైల్ రూపంలో ఉన్న యాప్ ఫోన్లలో డౌన్‌లోడ్ అవుతుంది. దానిలోని మాల్‌వేర్ ద్వారా ఫోన్‌లోని వ్యక్తిగత డేటా, కాంటాక్ట్స్, ఫొటోలు, ఎస్ఎంఎస్‌లు వారి చేతుల్లోకి చేరుతాయి. వాటి ఆధారంగా అకౌంట్ ఖాతాల్లోని సొమ్ముని ఖాళీ చేస్తున్నారు.హైదరాబాద్‌లో ఇటీవల ఓ ఐటీ ఉద్యోగికి వివాహ ఆహ్వానం పేరిట లింక్ వచ్చింది. దానిలో సమాచారం చూసేందుకు ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వారు చెప్పినట్టు చేయగానే ఫోన్ హ్యాక్ చేసి రూ.లక్షన్నర కొట్టేశారు. బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సైబర్ మాయగాళ్ల బారిన పడకుండా పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ చేస్తే వెంటనే ఇంటర్నెట్ ఆఫ్ చేయాలి. అనుమానాస్పద యాప్‌ను అన్ ఇన్‌స్టాల్ చేయాలి. పాస్‌వర్డ్స్, బ్యాంకు పిన్ నంబర్లు మార్చాలి. బ్యాంకు లావాదేవీలను పరిశీలించాలి. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్, టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలి.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి :**

సందేశాల రూపంలో వచ్చే అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయొద్దు.అది నిజమైనది పంపితే పీడీఎఫ్ లేదా జేపీజీ పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఉంటుంది. ఏపీకే ఫైల్ వచ్చిందంటే మోసమేనని గ్రహించాలి.బంధుమిత్రుల పేర్లు, ఫోన్ నంబర్లలో ఏపీకే ఫైల్ ఉన్నట్టు గుర్తిస్తే ఫోన్ చేసి వాస్తవాలు తెలుసుకోవాలి.యాప్స్‌ను గూగుల్ ప్లే, ఆపిల్ యాప్ స్టోర్ నుంచే డౌన్‌లోడ్ చేసుకోవాలి.ఏపీకే ఫైల్స్ ద్వారా డౌన్‌లోడ్ చేయొద్దు.ఫోన్ సెక్యూరిటీని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుండాలి.యాంటీవైరస్, సెక్యూరిటీ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి."ఫోన్‌కు వచ్చే అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వివాహ ఆహ్వానపత్రిక పేరుతో ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేయించి ప్రమాదకరమైన మాల్‌వేర్‌తో ఫోన్ హ్యాక్ చేసి సమాచారం చోరీ చేస్తున్నారు. పెళ్లి శుభలేఖ, కొత్త సినిమా ఉచితంగా చూడవచ్చని అమాయకులకు ఆశచూపి మోసాలకు పాల్పడుతున్నారు. లింకుల వెనుక దాగిన ప్రమాదాన్ని గుర్తించండి. తెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలు, లింక్‌లకు స్పందించవచ్చు" - అరవింద్‌బాబు, డీసీపీ, హైదరాబాద్ సైబర్ క్రైమ్.కొత్త నంబర్లు, ఖాతాల నుంచి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ తదితరాలకు ఆహ్వాన పత్రికలు, వీడియోలు, లింకులు, ఫైళ్లను సైబర్ నేరస్థులు పంపిస్తారు. దీంతో మనమేం చేస్తాం ఎవరు పంపారనే ఆసక్తితో క్లిక్ చేస్తే మన ప్రమేయం లేకుండా మొబైల్‌లోకి ఏపీకే ఫైల్ రూపంలో ఉండే యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. ఫోన్ గ్యాలరీ, యాప్‌లలోని డేటాతో సహా అన్ని రకాల అనుమతుల్ని ఈ మాల్‌వేర్ సొంతంగా దానంతట అదే తీసుకుంటుంది. ఇలా వెడ్డింగ్ ఇన్విటేషన్, వీడియోలు అని భావించి డౌన్‌లోడ్ చేస్తే ప్రమాదకర సాఫ్ట్ వేర్ యాప్‌లు ఇన్‌స్టాల్ అయి ఫోన్ హ్యాక్ అవుతుంది. దీంతో నేరగాళ్లు పూర్తిగా ఫోన్‌ను తమ అధీనంలోకి తీసుకుని బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బంతా కాజేస్తారు. ఫోన్, కంప్యూటర్‌లోని వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు ఇతర సమాచారాన్ని సేకరించి బెదిరింపులు చేస్తారు. ఇలాంటి తరహా ఫిర్యాదులు సైబర్ నేరగాళ్ల వెడ్డింగ్ ఇన్విటేషన్, వీడియోలు, లింకుల, ఫైళ్లు పంపుతూ మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

# 'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్-2026'

రాష్ట్ర పారిశ్రామిక రూపురేఖలను మారుస్తూ ఎంఎస్ఎంఈ రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం చరిత్రాత్మక అడుగు వేస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కలలకు ఊపిరిపోస్తూ విజయవాడ వేదికగా ప్రతిష్టాత్మక 'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్-2026' ను సీఎం చంద్రబాబు నేడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈమెగా ఈవెంట్ ద్వారా కొత్తగా 38 పారిశ్రామిక పార్కులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఈ సదస్సు ఒక బలమైన పునాదిగా నిలవనుంది.'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్-2026' కు విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదిక ముస్తాబైంది. 15వందల మందికి పైగా పారిశ్రామికవేత్తలు, పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు ఒకే వేదికపైకి రానున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మొత్తం 175 కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక రచించింది. తొలి 2 దశల్లో 100 ప్రాజెక్టుల పనులు మొదలవ్వగా నేడు మూడో విడత కింద 38 పార్కులకు సీఎం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలో సరికొత్త పెట్టుబడుల వాతావరణాన్ని సృష్టించేలా ఈ పార్కుల్లో అత్యాధునిక 'ప్లగ్-అండ్-ప్లే' మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నారు. అంటే ఔత్సాహికులు నేరుగా వచ్చి తమ కార్యకలాపాలను వెనువెంటనే ప్రారంభించుకునేలా ఈ మౌలిక సదుపాయాలు ఉండబోతున్నాయి.ఎన్టీఆర్ జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థలాల ఎంపిక పూర్తైంది. జగ్గయ్యపేట, విజయవాడ మధ్య, మైలవరం, నందిగామల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అవసరమైన స్థలాల గ్రౌండింగ్ పూర్తిచేసి ప్రస్తుతం పనులు కూడా చేస్తున్నారు. తాజాగా మిగతా విజయవాడ తూర్పు, పశ్చిమ, తిరువూరుల్లోనూ స్థలాల ఎంపికను పూర్తిచేశారు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను నిర్మిస్తారు. తక్కువ స్థలంలో టవర్‌ల రూపంలో ఈ భవనాలు నిర్మించి ఎక్కువ ఎంఎస్ఎంఈలకు కేటాయిస్తారు.మిగతా 4 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ యూనిట్లను పెట్టేందుకు స్థలాలను ఇస్తారు. దీనికి తగ్గట్టుగా విజయవాడలో ఖాళీగా ఉండే 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. మిగతాచోట్ల 10 నుంచి 50 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో భవానీపురంలోని లారీ స్టాండ్‌లో 2 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయనున్నారు. తూర్పు నియోజకవర్గంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఎకరా స్థలాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ పారిశ్రామిక టవర్‌ను నిర్మించనున్నారు. తిరువూరులో 50 ఎకరాలను గుర్తించారు. ఇక్కడ ఎంఎస్ఎంఈలకు స్థలాలను కేటాయించనున్నారు. ఈ మూడింటిని విజయవాడ నుంచి నేడు సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు.గ్రామీణ ఆవిష్కర్తలను ప్రోత్సహించే దిశగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. కుప్పం, మంగళగిరి, పిఠాపురం ప్రాంతాల్లో 'రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్' ఎక్స్‌టెన్షన్ కేంద్రాలను సీఎం ప్రారంభిస్తారు. పరిశ్రమల మనుగడకు అవసరమైన ఉమ్మడి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం భారీగా ఆర్థిక ఊతం ఇవ్వనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45 పారిశ్రామిక క్లస్టర్లలో కామన్ ఫెసిలిటీస్ కోసం ఏకంగా రూ.200 కోట్ల నిధులను ఈ సమ్మిట్ వేదికగా విడుదల చేయనున్నారు.ఈ సదస్సు అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా రూపుదిద్దుకుంది. ఏపీని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయాణంలో ఈ 'గ్రోత్ సమిట్' ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని పారిశ్రామిక వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# బంగారం, వెండి ధరలు

**ఏపీ, తెలంగాణలో ఎంతంటే , వరుస పెరుగుదల తర్వాత తగ్గిన బంగారం ధరలు**

**కిలో వెండి ధరలోనూ తగ్గుదల , అంతర్జాతీయ మార్కెట్ ప్రభావమే ప్రధాన కారణం**



గత కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు సోమవారం మళ్లీ కొంత బ్రేక్ పడింది. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా భారీగా పెరిగిన పసిడి ధరలు ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలని ఎదురు చూస్తున్న వారికి కొంత ఊరట లభించింది. వెండి ధరలు కూడా స్వల్పంగా తగ్గాయి.క్యాప్స్ గోల్డ్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 9 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,145గా ఉంది. శనివారం ఇదే ధర రూ.1,63,079గా ఉండగా, రెండు రోజుల వ్యవధిలోనే మూడు వేల రూపాయలకుపైగా తగ్గింది. దీంతో ఇటీవల కొనుగోలు వాయిదా వేసుకున్న వారు మళ్లీ మార్కెట్ వైపు చూస్తున్నారు.ఇక వెండి ధరల్లో కూడా స్వల్ప మార్పు కనిపించింది. కిలో వెండి ధర సోమవారం నాటికి రూ.2,75,571కి చేరుకుంది. శనివారం కిలో వెండి రూ.2,73,500 వద్ద ఉండగా ప్రస్తుతం స్వల్పంగా తగ్గుదల కనిపించింది. మార్కెట్ పరిస్థితులను బట్టి వెండి ధరల్లో కూడా హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. అయితే అంతర్జాతీయ బులియన్ మార్కెట్లో కూడా ధరల్లో మార్పులు చోటుచేసుకున్నాయి.నేటి స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 4,558.35 డాలర్లుగా నమోదైంది. మరోవైపు స్పాట్ సిల్వర్ ధర ఔన్సుకు 77.59 డాలర్లుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, డాలర్ మారకపు విలువల మార్పులు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం, ఆర్థిక మందగమనం వంటి అంశాల ప్రభావంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో బంగారంపై డిమాండ్ పెరిగి ధరల్లో భారీ మార్పులు కనిపిస్తున్నాయి. అయితే కొన్ని రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లలో కొంత స్థిరత్వం కనిపించడంతో పసిడి ధరలు తగ్గుముఖం పట్టినట్లు విశ్లేషకులు చెబుతున్నారు.బంగారం స్వచ్ఛతను క్యారట్ల ఆధారంగా కొలుస్తారు. క్యారట్ల సంఖ్య పెరిగే కొద్దీ బంగారం నాణ్యత కూడా పెరుగుతుంది. 24 క్యారెట్ల బంగారం అంటే దాదాపు 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం అని అర్థం. ఈ బంగారం ప్రధానంగా కాయిన్లు, బార్లు, బిస్కెట్ల రూపంలో లభిస్తుంది. ఆభరణాల తయారీలో ఎక్కువగా 22 క్యారెట్ల బంగారాన్ని ఉపయోగిస్తారు. దీనిని 916 గోల్డ్ అని కూడా పిలుస్తారు. ఇందులో బంగారంతో పాటు ఇతర లోహాలను కలిపి నగలు తయారు చేస్తారు. నగల ధర నిర్ణయంలో పలు అంశాలు ప్రభావం చూపుతాయి. బంగారం ప్రస్తుత మార్కెట్ ధరతో పాటు తయారీ ఛార్జీలు, తరుగు, జీఎస్‌టీ వంటి అంశాలు కలిపి తుది ధర నిర్ణయిస్తారు. కొన్ని దుకాణాలు ప్రారంభంలో తక్కువ ధర చూపించినా, బిల్లు వేయించే సమయంలో పన్నులు, ఇతర ఛార్జీలు జోడించడంతో ధర పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే కొనుగోలు చేసే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.ముఖ్యంగా బంగారం కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు బిల్లు లేకుండా కొంటే జీఎస్‌టీ అవసరం ఉండదని చెప్పినా, అది భవిష్యత్తులో ఇబ్బందులకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బిల్లు లేకపోతే బంగారం నాణ్యతపై సమస్యలు వచ్చినా, మరమ్మతులు అవసరమైనా వినియోగదారులకు రక్షణ ఉండదు. కాబట్టి హాల్‌మార్క్ ఉన్న ఆభరణాలు మాత్రమే కొనుగోలు చేయాలని, అధికారిక బిల్లు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మన దేశంలో బంగారం అవసరాల్లో ఎక్కువ భాగం దిగుమతుల ద్వారానే నెరవేరుతోంది.దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగినా, తగ్గినా దేశీయ మార్కెట్‌పై నేరుగా ప్రభావం పడుతుంది. ముఖ్యంగా డాలర్‌తో రూపాయి మారకపు విలువ కూడా బంగారం ధరల మార్పులో కీలక పాత్ర పోషిస్తుంది. డాలర్ బలపడితే దిగుమతి ఖర్చు పెరిగి దేశీయంగా బంగారం ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. మరోవైపు పండుగలు, వివాహాల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో బంగారం కొనుగోళ్లపై ప్రజల్లో ఆసక్తి కొనసాగుతోంది. ధరలు తగ్గుతున్న వేళ చాలా మంది కొనుగోలుకు ముందుకు వచ్చే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. అయితే బంగారం, వెండి ధరలు ప్రతిరోజూ మారుతూ ఉండటంతో కొనుగోలు ముందు తాజా ధరలను ఒకసారి పరిశీలించడం మంచిదని సూచిస్తున్నారు.

# బ్యాంకు అకౌంట్ ఫ్రీజ్ అయిందా




కొన్నిసార్లు బ్యాంకు ఖాతా బ్లాక్ (ఫ్రీజ్) అయిందని చాలా మంది అనడం మీరు వినే ఉంటారు. లేదంటే మీరు కూడా ఈ పరిస్థితిని ఎదుర్కొని ఉండొచ్చు! ఆ సమయంలో ఆర్థిక లావాదేవీలు పూర్తిగా స్తంభించిపోతాయి. అప్పుడు కంగారు పడటం సహజం. అసలు అకౌంట్ ఎందుకు ఆగిపోయిందో తెలుసుకుంటే, దాన్ని రీయాక్టివేట్ చేయడం చాలా సులభమని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. మరి అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.ముఖ్యంగా మూడు కారణాల వల్ల బ్యాంకులు ఖాతాలను నిలిపివేస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి (కేవైసీ) పెండింగ్‌లో ఉండటం, అనుమానాస్పద లావాదేవీలు, చట్టపరమైన ఆదేశాలు తదితరాలు ఇందుకు కారణం కావచ్చని చెబుతున్నారు. సమస్యను బట్టి, పరిష్కారం ఉంటుందని వివరిస్తున్నారు. ముందుగా మీ బ్యాంకు మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ పోర్టల్‌ను పరిశీలించాలని సూచిస్తున్నారు. అందులో మీ అకౌంట్‌ను నిలిపివేయడానికి గల కారణాలను పేర్కొంటాయని తెలియజేస్తున్నారు.ఒకవేళ విషయం స్పష్టంగా తెలియకపోతే, బ్యాంకు వినియోగదారుల సేవా కేంద్రానికి ఫోన్ చేయాలని చెబుతున్నారు. అదేవిధంగా దగ్గరలో ఉన్న బ్యాంకు శాఖను సందర్శించాలని సూచిస్తున్నారు. ఖాతా ఎందుకు నిలిచిపోయిందనే విషయాన్ని బ్యాంకులు విభాగాల వారీగా నమోదు చేస్తాయని అంటున్నారు. కాబట్టి కేవలం సాంకేతిక సమస్యలాంటి సాధారణ సమాధానాలతో సరిపెట్టుకోవద్దని తెలియజేస్తున్నారు. సరైన కారణం తెలుసుకుంటే అందుకు తగిన చర్యలు తీసుకునేందుకు వీలవుతుందని వివరిస్తున్నారు.ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం కేవైసీ పత్రాలు సరిగా లేకపోతే, అకౌంట్లను బ్యాంకులు నిలిపివేస్తాయని పేర్కొంటున్నారు. పాన్-ఆధార్ అనుసంధానం చేయకపోవడం, ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉండటం, మారిన అడ్రస్, ఫోన్ నంబర్లను అప్‌డేట్ చేయకపోవడం వీడియో లేదా సెల్ఫీ వెరిఫికేషన్ అసంపూర్తిగా ఉండటం దీనికి ప్రధాన కారణాలని వివరిస్తున్నారు. నిబంధనలు మారితే, ఎంత పాత ఖాతాలనైనా బ్యాంకులు నిలిపివేసే అవకాశం ఉందని తెలియజేస్తున్నారు.కేవైసీ సమస్య ఉంటే, ఏ పత్రాలు అవసరమో బ్యాంకును అడిగి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. వారు అడిగిన పత్రాలను సమర్పించి, రసీదు తీసుకోవాలని చెబుతున్నారు. పత్రాలను ఆమోదించిన తర్వాత రెండు నుంచి ఐదు పనిదినాల్లో ఖాతా పునరుద్ధరణ జరుగుతుందని అంటున్నారు.గత లావాదేవీల సరళికి విరుద్ధంగా అకస్మాతుగా భారీ మొత్తంలో డబ్బు అకౌంట్‌లో జమ కావడం, పదేపదే అధిక విలువగల బదిలీలు జరగడం వంటివి అనుమానాస్పద లావాదేవీలుగా పరిగణించి ఖాతాలను బ్లాక్ చేస్తారని వివరిస్తున్నారు. ట్రేడర్లు, ఫ్రీలాన్సర్లు, చిన్న వ్యాపార యజమానులు తరచుగా ఈ సమస్యను ఎదుర్కొంటారని చెబుతున్నారు.ఇలాంటి సందర్భాల్లో వెంటనే స్పందించి, నిధుల మూలాన్ని, ఉద్దేశాన్ని స్పష్టంగా బ్యాంకుకు తెలియజేయాలని సూచిస్తున్నారు. సేల్ డీడ్‌లు, శాలరీ స్లిప్స్, ఇన్వాయిస్‌లు వంటి ఆధారాలను సమర్పించాలని చెబుతున్నారు. బ్యాంకులు మీ లావాదేవీల పట్ల స్పష్టతను కోరుకుంటాయని వివరిస్తున్నారు. కాబట్టి అస్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదా జాప్యం చేయడం వల్ల అకౌంట్ నిలిపివేత మరింత కాలం కొనసాగవచ్చని హెచ్చరిస్తున్నారు.కోర్టు ఆదేశాలు లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్డర్, ఆదాయపు పన్ను నోటీసు కారణంగా అకౌంట్ బ్లాక్ అయితే, బ్యాంకు దానంతట అదే ఆంక్షలను తొలగించలేదని వివరిస్తున్నారు. ఖాతాలోని మొత్తం బ్యాలెన్స్‌ను లేదా కొంత మొత్తాన్ని మాత్రమే (ఉదాహరణకు, రికవరీ చేయాల్సిన మొత్తం) బ్లాక్ చేశారా అనేది చూడాలని సూచిస్తున్నారు. చాలాసార్లు వివాదాస్పద భాగాన్ని మాత్రమే ఫ్రీజ్ చేస్తారని చెబుతున్నారు. సంబంధిత అధికారుల నుంచి అనుమతి వచ్చాకే బ్యాంకు మీ అకౌంట్‌ను యాక్టివేట్ చేస్తుందని, ఇందుకు కొంత సమయం పడుతుందని అంటున్నారు.మీ ప్రాథమిక అకౌంట్ బ్లాక్ అయినప్పుడు, ప్రత్యామ్నాయంగా మీకున్న రెండో అకౌంట్‌ను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు.తాత్కాలికంగా మీ జీతాన్ని వేరే ఖాతాకు బదిలీ చేయమని మీ సంస్థను కోరాలని చెబుతున్నారు.మీరు మరో అకౌంట్‌ను తెరవడానికి లేదా నిర్వహించేందుకు అనుమతి ఉందో లేదో బ్యాంకును అడిగి తెలుసుకోవాలని వివరిస్తున్నారు.అన్ని నిబంధనలనూ పూర్తి చేసినప్పటికీ, బ్యాంకు ఖాతాను నిర్ణీత గడువు లోపు పునరుద్ధరించకపోతే, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. అవసరాన్ని బట్టి, బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.చాలా సందర్భాల్లో అకౌంట్ ఫ్రీజ్ కావడం అనేది నిబంధనల్లో భాగమే కానీ, శిక్ష కాదని తెలియజేస్తున్నారు. సరైన కారణాన్ని గుర్తించి, కచ్చితమైన సమాచారాన్ని అందిస్తే ఖాతా వేగంగానే అందుబాటులోకి వస్తుందని అంటున్నారు.

# ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా డీఎంఈ

**ఇంధన స్వయంసమృద్ధి దిశగా భారత్!**

**ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా డైమిథైల్ ఈథర్ డీఎంఈ**

**ఇప్పటికే ప్రొడక్షన్ ప్రారంభం**

**ఇంధన దిగుమతులు తగ్గించే దిశగా భారత్ అడుగులు**




పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తలెత్తింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో బాలాజీ అమైన్స్ లిమిటెడ్ సంస్థ దేశంలోనే మొదటి వాణిజ్య స్థాయి డైమిథైల్ ఈథర్ (డీఎంఈ) తయారీ ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ విధంగా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం, ఇంధన స్వయంసమృద్ధి దిశగా భారత్ ముందడుగు వేసింది.భారత్ ఎక్కువగా ఎల్పీజీ దిగుమతులపై ఆధారపడుతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రపంచ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, అస్థిర ఇంధన మార్కెట్ల నేపథ్యంలో ఇది భారత్‌కు భారంగా మారుతోంది. అందుకే ఎల్పీజీ దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాల్లో ఈ ప్రాజెక్ట్ ఒక కీలక ముందడుగుగా చెప్పవచ్చు. మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోని చించోలిలో ఉన్న ఈ డీఎంఈ కేంద్రం వార్షిక సామర్థ్యం 1,00,000 మెట్రిక్ టన్నులు. ఇది మే 20 నుంచి తన వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించింది.డీఎంఈని స్వచ్ఛంగా మండే ఇంధనంగా పరిగణిస్తారు. దీనిని ఎల్పీజీ స్థానంలో పూర్తిగా ఉపయోగించవచ్చు. లేదా ఎల్పీజీతో కలపవచ్చు. యూరప్, ఆసియాలోని చాలా దేశాలు ఇప్పటికే డీఎంఈని ఎల్పీజీలో 20 శాతం వరకు కలుపుతున్నాయి. భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఇటీవల ఎల్పీజీతో డీఎంఈను 8 శాతం వరకు కలపడానికి అనుమతి ఇచ్చింది. ఇది దేశీయ ఇంధన వ్యవస్థలో డీఎంఈని క్రమంగా ప్రవేశపెట్టడానికి మార్గాన్ని సుగమం చేసింది. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో దాదాపు నాలుగో వంతును దిగుమతి చేసుకుంటున్న తరుణంలో ఈ పరిణామం జరగడం గమనార్హం.ప్రముఖ శాస్త్రవేత్త, నీతి ఆయోగ్ మాజీ సభ్యుడు వీకే సారస్వత్ ఈటీవీ భారత్‌తో మాట్లాడుతూ, “డీఎంఈ ఒక ముఖ్యమైన ప్రత్యామ్నాయ ఇంధనంగా మారుతోంది. ఇ ది ఎల్పీజీ స్థానాన్ని భర్తీ చేయగలదు. ఎల్పీజీతో దీనిని కలపడం ద్వారా ఇంధన దిగుమతులపై ఆధారపడడాన్ని భారత్ తగ్గించుకోవచ్చు” అని చెప్పారు.‘స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, స్థానిక ముడి పదార్థాలు ఉపయోగించి డీఎంఈను దేశీయంగానే తయారు చేయడమే దీర్ఘకాలిక లక్ష్యమని’ వీకే సారస్వత్ వివరించారు. డీఎంఈ ఉత్పత్తిలో ఉపయోగించే కీలక ముడి పదార్థమైన మిథనాల్‌ను బొగ్గు ఆధారిత ప్రక్రియతో సహా పలు మార్గాల ద్వారా ఉత్పత్తి చేయవచ్చునని ఆయన చెప్పారు. పుణెలోని నేషనల్ కెమికల్ లాబొరేటరీ (ఎన్‌సీఎల్) ఇప్పటికే ఉత్ప్రేరక సాంకేతికతో పాటు స్వదేశీ డీఎంఈ సాంకేతికతను అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. ‘ఒక పైలట్ ప్లాంట్ ఇప్పటికే పనిచేస్తుండగా, మరికొన్ని ప్రైవేటు కంపెనీలు కూడా దిగుమతి చేసుకున్న మిథనాల్‌ను ఉపయోగించి భారీ ఎత్తున ఉత్పత్తిని ప్రారంభించాయి’ అని ఆయన అన్నారు.బాలాజీ అమైన్స్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపితే, అది ఏటా సుమారు ఒక లక్ష టన్నుల మిథనాల్‌ను వినియోగిస్తుంది. అయితే భారత ఇంధన భద్రత లక్ష్యాల కోసం ఈ ప్రాజెక్టు పనిచేస్తుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామ్ రెడ్డి తెలిపారు. “భారతదేశ ఇంధన భద్రతను బలోపేతం చేసే దిశగా ఇది చాలా కీలకమైన అడుగు. ప్రస్తుతం భారత్ విదేశాల నుంచి భారీ పరిమాణంలో ఎల్పీజీని దిగుమతి చేసుకుంటోంది. అయితే ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, అవి ఇంధన సరఫరా గొలుసును నేరుగా ప్రభావితం చేస్తుండడం మనం చూస్తున్నాం. అందుకే ఇంధన రంగంలో మన దేశం స్వావలంబన సాధించే దిశగా పయనించడానికి ఇదే సరైన సమయం” అని రామ్ రెడ్డి పేర్కొన్నారు.హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, బిస్కట్ తయారీ, ఏరోసోల్ అనువర్తనాలు, సిరామిక్స్, బల్బుల తయారీ లాంటి రంగాల్లో డీఎంఈ ఉపయోగపడుతుంది. అలాగే బల్క్ ఎల్పీజీ వినియోగంపై ఎక్కువగా ఆధారపడే ఇతర పరిశ్రమల్లో డీఎంఈకి భారీ వాణిజ్య సామర్థ్యం ఉందని కంపెనీ విశ్వసిస్తోంది. ‘డీఎంఈని ఎల్పీజీతో మిళితం చేసి, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాల ద్వారా వినియోగించుకోవచ్చు. కాబట్టి రానున్న ఏళ్లలో ఇది భారతదేశానికి ఆర్థికంగా, ఆచరణాత్మకంగా ప్రత్యామ్నాయ ఇంధనంగా మారే అవకాశం ఉంది’ అని రామ్ రెడ్డి అన్నారు.కాగా, మన దేశంలో మిథనాల్ ఉత్పత్తి సామర్థ్యం పరిమితంగానే ఉందని పరిశ్రమ నిపుణులు అంటున్నారు. ‘భారతీయ మిథనాల్ తయారీదారులు చాలా మంది ప్రస్తుతం సహజ వాయువు సరఫరాలపై ఎక్కువగా ఆధారపడి ఉన్నారు. ఇది దిగుమతులపై ఆధారపడడాన్ని మరో స్థాయికి పెంచుతోంది. అయితే భవిష్యత్తులో దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడానికి, భారత్ మిథనాల్ ఉత్పత్తి కోసం బొగ్గు గ్యాసిఫికేషన్‌పై దృష్టి పెట్టాలి’ సారస్వత్ పేర్కొన్నారు. అయితే ఇందుకోసం పెట్టుబడులను ప్రోత్సహించడం, దేశీయ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచడం లక్ష్యంగా కేంద్రం ఇప్పటికే రూ.37,500 కోట్లతో బొగ్గు గ్యాసిఫికేషన్ మిషన్‌ను ప్రారంభించిందని ఆయన తెలిపారు.‘డీఎంఈ వల్ల అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే, భారతదేశంలోని ప్రస్తుత ఎల్పీజీ పంపిణీ నెట్‌వర్క్‌ను దీని కోసం వాడుకోవచ్చు. నిల్వ వ్యవస్థలు, రవాణా మౌలిక సదుపాయాలు, సిలిండర్లు, బర్నర్‌లు చాలా వరకు డీఎంఈకి అనుకూలంగా ఉంటాయని, కేవలం చిన్నపాటి మార్పులు మాత్రమే అవసరం’ అని సారస్వత్ వివరించారు. ‘డీఎంఈ అనేది ఎల్పీజీ కంటే చౌక. అందువల్ల గృహాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న పరిశ్రమలకు ప్రయోజనం చేకూరుతుంది’ అని ఆయన పేర్కొన్నారు. ‘ప్రస్తుతం భారత్‌లో ఎల్పీజీలో 8 శాతం డీఎంఈ కలపడం ప్రారంభం అవుతోంది. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ఇంకా ప్రణాళిక దశలోనే ఉన్నాయి. దేశవ్యాప్త అమలుకు ముందు పైలట్ ప్రాజెక్టులను మూల్యాంకనం చేస్తున్నాయన్నారు. పలు పరీక్షలు, అధ్యయనాల అనంతరం భవిష్యత్‌లో దీనిని క్రమంగా 20 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని’ ఆయన పేర్కొన్నారు. కాగా, పైప్డ్ నేచురల్ గ్యాస్ నెట్‌వర్క్‌ల వైపు నగరాలు మళ్లుతున్న తరుణంలో, ఖాళీగా ఉన్న ఎల్పీజీ ట్యాంకర్లను డీఎంఈ రవాణాకు కూడా ఉపయోగించుకోవాలని కంపెనీ ప్రతిపాదించింది. ఎల్పీజీ కంటే డీఎంఈ తక్కువ పీడనం వద్ద పనిచేస్తుందని, అందువల్ల పూర్తిగా వినియోగంలో లేని లాజిస్టిక్స్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవడానికి ఇది సాయపడుతుందని పేర్కొంది.ప్రత్యామ్నాయ ఇంధనాలతో పాటు, బాలాజీ అమైన్స్ సంస్థ ఎలక్ట్రిక్ వెహికల్ బ్యాటరీ కెమికల్స్ విభాగంలోనూ వేగంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం బ్యాటరీ-గ్రేడ్ రసాయనాలను తయారు చేయడానికి ప్లాంట్లను ఆధునీకీకరణ చేస్తోంది. ఇవి ఇప్పటికే ఈవీ బ్యాటరీ ఎలక్ట్రోలైట్‌లో కీలక భాగమైన ఎలక్ట్రానిక్-గ్రేడ్ డైమిథైల్ కార్బొనేట్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. దీని వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 15వేల మెట్రిక్ టన్నులు. దీనితోపాటు ఈవీ బ్యాటరీల తయారీలో ఉపయోగించే సాల్వెంట్ (ద్రావకం) అయిన ఎలక్ట్రానిక్-గ్రేడ్ ఎన్-మిథైల్ పెరోలిడోన్‌ను కూడా ఉత్పత్తి చేస్తోంది.పుణెలోని సీఎస్ఐఆర్-నేషనల్ కెమికల్ లాబొరేటరీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ తిరుమలైస్వామి రాజా ఈటీవీ భారత్‌తో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. “డీఎంఈ అనేది ఎల్పీజీకి అత్యంత అనుకూలమైన ప్రత్యామ్నాయం. ఎందుకంటే ఇది తక్కువ ఉద్గారాలతో చాలా స్వచ్ఛంగా మండుతుంది. దీనిని బయోమాస్, వ్యర్థాల వంటి బహుళ దేశీయ వనరుల నుంచి ఉత్పత్తి చేయవచ్చు. హైడ్రోజన్ వంటి ఇంధనాలతో పోల్చితే, మనదేశంలో ప్రస్తుతం ఉన్న ఎల్పీజీ మౌలిక సదుపాయాలు డీఎంఈకి అతిపెద్ద ప్లస్ పాయింట్. ఎందుకంటే చాలా తక్కువ మార్పులతో దీనిని ప్రస్తుత వ్యవస్థలో విలీనం చేయవచ్చు” అని అన్నారు. ఇక భారతదేశపు మొదటి వాణిజ్య డీఎంఈ ప్రాజెక్టు సాధించే విజయం, స్వచ్ఛమైన ప్రత్యామ్నాయ ఇంధనాలు, దేశీయ మిథనాల్ ఉత్పత్తి, దీర్ఘకాలిక ఇంధన వైవిధ్య వ్యూహాలపై తీసుకునే విధానపరమైన నిర్ణయాలను నిర్దేశిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# అత్యవసర రుణాల కోసం “యాప్స్” వాడుతున్నారా





అత్యవసరంగా డబ్బు కావాల్సినప్పుడు పర్సనల్ లోన్స్ కోసం బ్యాంకులు లేదా చీదీఖీజని సంప్రదించడం తెలిసిందే. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. వ్యక్తిగత రుణాలు అందించే ఫిన్‌టెక్ యాప్‌లు చాలానే అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం డిజిటల్ టెక్నాలజీ అభివృద్ధి కారణంగా ఈ యాప్స్ ద్వారా నిమిషాల్లోనే లోన్ కోసం దరఖాస్తు చేసుకోవడం, దాన్ని పొందడం పూర్తవుతోంది. అయితే రుణ లభ్యత వేగం మాటున కొన్ని ప్రమాదాలు ఉన్నాయంటున్నారు ఆర్థిక నిపుణులు. ఆర్‌బీఐ నియంత్రణ లేని రుణ యాప్‌లు ఈ రంగంలో ఉండడం వల్ల.. అధిక రుసుములు వసూలు చేయడం, డేటా దుర్వినియోగం, దౌర్జన్యంగా డబ్బు వసూలు చేయడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే వేగంగా రుణాలు ఇస్తామని చెప్పే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసే ముందు, కొన్ని కీలక విషయాలను చెక్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం.ఇన్‌స్టాల్ చేసే ముందు లోన్ ఇచ్చే ప్లాట్‌ఫాం చట్టబద్ధమైందో, కాదో చెక్ చేయడం ముఖ్యమంటున్నారు. ఈ క్రమంలోనే యాప్‌కు ఆర్‌బీఐ కింద నమోదైన ఏదైనా బ్యాంకింగ్ సంస్థ లేదా ఎన్‌బీఎఫ్‌సీ సపోర్టు ఉందో లేదో చెక్ చేయాలని సూచిస్చున్నాకు. ఎందుకంటే నకిలీ యాప్‌లు రుణ నిబంధనలను సరిగ్గా పాటించవని.. ఇవి తీవ్రమైన ఆర్థిక ప్రమాదంలో పడేయగలవని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా నకిలీ యాప్‌లు.. పనిచేయని లింకులతో, అక్షర దోషాలు లేదా సరైన డిజైన్ లేకుండా ఉండొచ్చని అంటున్నారు. అందుకే రుణ సంస్థ.. ఆర్‌బీఐ వద్ద నమోదు అయ్యిందో లేదో నిర్ధారించడానికి, యాప్ సైట్‌లో ూఎశీబ్ ఖం విభాగాన్ని చెక్ చేయమంటున్నారు. అది ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయ్యిందని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే ఉపయోగించాలంటున్నారు.కొన్ని యాప్‌లు లోన్‌కు అప్లై చేసే దరఖాస్తుదారుల ఫోటోలు, కాంటాక్ట్‌లు, ఇతర డేటా యాక్సెస్ కోరుతుంటాయి. ఇలా పర్సనల్ వివరాలు తీసుకుని తద్వారా ప్రైవసీకి భంగం కలిగిస్తాయని.. ఈ క్రమంలోనే రుణగ్రహీతలు తమ పర్సనల్ డేటాను కోల్పోకుండా చూసుకోవాలని హెచ్చరిస్తున్నారు. చాలా రుణ యాప్‌లు కాంటాక్ట్‌లు లేదా ూమీా డేటా వంటి సున్నితమైన వ్యక్తిగత డేటాను యాక్సెస్ చేయడానికి అనుమతులు అడుగుతాయని.. ఇలాంటి టైమ్‌లో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.లోన్ కోసం అప్లై చేసే ముందు ఆ యాప్ డేటా రక్షణ నిబంధనలకు అనుగుణంగా ఉందో, లేదో తెలుసుకోవాలంటున్నారు. అంటే యాప్, వెబ్‌సైటుకు సంబంధించిన ప్రైవసీ పాలసీని చెక్ చేసి, అందులో 27001 సర్టిఫికేషన్ లేదా మరేదైనా డేటా రక్షణ ప్రమాణాల గురించి ప్రస్తావించారో లేదో చూడమంటున్నారు. ఈ సర్టిఫికేషన్, మీ వ్యక్తిగత, ఆర్థిక డేటాను రక్షించడానికి యాప్ అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తుందనే విషయాన్ని సూచిస్తుందని వివరిస్తున్నారు. ఇది మీ వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం కాకుండా కాపాడుతుంది. అలాగే, రుణ సంస్థకు సంబంధించిన వెబ్‌సైట్ సురక్షితంగా ఉందో లేదో తనిఖీ చేయడం కూడా ముఖ్యమంటున్నారు. సురక్షితమైన వెబ్‌సైట్‌తో ప్రారంభమవుతుందమ్ సూచిస్తున్నారు.రుణగ్రహీతలు ఏదైనా ప్లాట్‌ఫాంలో లోన్ తీసుకోవడానికి ముందు, యాప్ స్టోర్‌లోని రివ్యూలను చదవాలంటున్నారు. ఒక లోన్ యాప్ నమ్మదగిందో, కాదో చెక్ చేయడానికి గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆపిల్ యాప్ స్టోర్‌లో దాని సమీక్షలు, రేటింగ్‌లను చూడాలని సలహా ఇస్తున్నారు. పారదర్శకత లోపించడం, అధిక వడ్డీ రేట్లు, దాచిన రుసుములు లేదా దురుసుగా ప్రవర్తించే రికవరీ ఏజెంట్ల గురించి వినియోగదారులు ఫిర్యాదు చేస్తుంటే జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. అన్ని ప్రమాణాలు పాటించే పరన్సల్ లోన్ యాప్‌లు తమ రుణ విధానాలలో పారదర్శకతను కలిగి ఉంటాయని.. అదనంగా కస్టమర్ కేర్ సపోర్ట్‌ను అందిస్తాయంటున్నారు.రుణ సంస్థలు లోన్ ఇచ్చే ముందు దరఖాస్తుదారుడికి “కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్‌ను” అందిస్తాయని.. దీని ప్రకారం కాలపరిమితి సమయంలో ఏ దశలోనైనా రుణ సంస్థ ఈ స్టేట్‌మెంట్‌లో లేని ఎలాంటి ఛార్జీలు, జరిమానాలు వసూలుజేయకూడదంటున్నారు. ఈ స్టేట్‌మెంట్‌లో ఫిర్యాదుల పరిష్కార అధికారి, ఒప్పందంలో పాల్గొన్న వారి వివరాలు ఉంటాయని.. మరీ ముఖ్యంగా, రుణ సంస్థలు వ్యక్తిగత రుణ ఆమోదానికి ముందు ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించమని అడగరంటున్నారు. ఒకవేళ యాప్.. రుణ ప్రాసెసింగ్‌కు ముందే రుసుము చెల్లించాలని మిమ్మల్ని అడిగితే, అది మోసపూరిత యాప్ కావచ్చని.. అలాంటి వాటికి దూరంగా ఉండాలంటున్నారు.అసలైన రుణ సంస్థలకు సరైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, కస్టమర్ కేర్ ఫోన్ నంబర్, కార్యాలయ చిరునామా, ఇమెయిల్ లాంటి వివరాలు కచ్చితంగా ఉంటాయి. ఇన్‌స్టంట్ వ్యక్తిగత రుణ యాప్.. దాని సహాయక టీంను సంప్రదించడానికి రుణ దరఖాస్తుదారుడికి ఎలాంటి అవకాశాన్ని ఇవ్వకపోతే, అది మోసపూరిత యాప్ అనడానికి ఒక ప్రధాన సంకేతంగా గుర్తించాలంటున్నారు.వ్యక్తిగత రుణం తీసుకునేటప్పుడు.. సులభంగా తిరిగి చెల్లించగలిగినంత రుణం మాత్రమే తీసుకోవాలంటున్నారు. రుణాన్ని బాధ్యతాయుతంగా తీసుకోవడం చాలా ముఖ్యమంటున్నారు. ఇలా అప్లై చేయగానే అలా రుణం లభిస్తున్నంత మాత్రాన మీకు రుణ అర్హత బాగా ఉన్నట్లు కాదంటున్నారు. లోన్ తీసుకున్న తర్వాత కూడా అనేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తవచ్చని.. అందుచేత, ఈఎంఐ చెల్లింపుల విషయంలో మీ ఆర్థిక స్థోమత సరిపోతుందో, లేదో ముందే అంచనా వేసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# వందలో 90 మందిది “ఉల్లిగడ్డ జీతం”!



నెలకు జీతం వేలకు వేలు వస్తుంది. కొందరికి లక్షదాటిపోద్ది! కానీ, నెలాఖరుకు వచ్చే సరికి చిల్లగవ్వ మిగలదు! అంతేనా క్రెడిట్ కార్డును గోకి ఐదో, పదో అప్పు కూడా చేస్తుంటారు! నగర జీవుల్లో మెజారిటీ పరిస్థితి ఇదే! ఇలాంటి వారి జీతాన్నే “ఆనియన్ శాలరీ” అంటారు. మరి, మీరు కూడా ఇదే జాబితాలో ఉన్నారా అయితే తప్పకుండా ఈ స్టోరీ చదవాల్సిందే !జీతం వచ్చిన తర్వాత ధనాధన్ ఖర్చు చేసి, ఫటా ఫట్ పర్సు ఖాళీ చేసేవారు కొందరైతే.. రాకముందే ఖర్చులతో ఎదురు చూసేవారు ఇంకొందరు. మొత్తానికి ఈ రెండు రకాల వాళ్లు కూడా నెలాఖరుకు దిక్కులు చూడాల్సిన కండీషన్‌లో నిలబడతారు. ఇలా జీతంలో రూపాయి కూడా మిగలని పరిస్థితినే “ఆనియన్ శాలరీ” అంటారు. అంటే.. ఉల్లిగడ్డను ఒక్కోపొర తీసేస్తూ వెళ్తే చివరి ఏముంటుంది ఏమీ మిగలదు కదా ఇదే విధంగా జీతం మొత్తం ఒక్కోపైసా మొత్తం ఖర్చు పెట్టేసే పరిస్థితినే “ఉల్లిగడ్డ జీతం” అంటారు.చాలా మంది జనాల్లో ఈ పరిస్థితి రావడానికి సోషల్ మీడియా ప్రధాన కారణమట! ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ రీల్స్ లో కొత్తగా ఏ వస్తువు కనిపించినా కొనేస్తుంటారట. ఇంతేకాకుండా.. ఇతరులతో కంపేర్ చేసుకొని, వాళ్ల ఇంట్లో ఉన్న ప్రతివస్తువూ మన ఇంట్లో కూడా ఉండాలనుకునే మనస్తత్వాలు పెరిగిపోతున్నాయట. దాంతో, అవసరం ఉన్నా లేకున్నా.. హోదా, స్థాయి చూపించుకునేందుకు అప్పులు చేసి, ఈఎంఐలు పెట్టి వస్తువులు కొనుగోలు చేస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.కిచెన్‌లో స్మార్ట్ గ్యాడ్జెట్స్, అత్యాధునిక హోమ్ డెకర్ ఐటమ్స్ లేకపోతే అది “ఇన్ కంప్లీట్ హౌస్”గా ఫీలవుతున్నారట చాలా మంది! ఇలా పోలిక, ‘పోటీ తత్వం’తో అనవసరపు ఆర్థిక భారాలు కొనితెచ్చుకుం టున్నారట! ఫలితంగా, వచ్చే జీతం సరిపోక చాలా మంది అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారట!మరోవైపు, ఈ జనరేషన్‌లో జాబ్ చేస్తున్న మహిళలు.. ఇంటిని, కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. ఈ బిజీ లైఫ్ వల్ల పిల్లల కోసం ఎక్కువ సమయం కేటాయి ంచలేకపోతున్నారు. ఈ పరిస్థితి మానసికంగా వారిని బాధిస్తోందట. అందుకే.. పిల్లలకు కనీసం వారు అడిగిన వస్తువులనైనా కొనిద్దామంటూ అవసరం ఉన్నా లేకున్నా అడిగిందల్లా కొనుగోలు చేస్తున్నారట. ఇది నెలవారీ బడ్జెట్‌ను పూర్తిగా దెబ్బతీయడమే కాకుండా.. పిల్లలకు డబ్బు విలువ తెలియకుండా మరింత గారాబం చేసేలా తయారు చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.వీటికి తోడు బ్రాండెడ్ డ్రెస్సులు, వీకెండ్ పార్టీలు, లగ్జరీ లైఫ్ స్టైల్ అన్నీ కలిసి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని చెబుతున్నారు. అందుకే ఇప్పుడే అలర్ట్ కావాలని సూచిస్తున్నారు.అవసరం ఏదీ.. కోరిక ఏదీ అనే తేడాను గుర్తించాలంటున్నారు. దుబారా ఖర్చులకు నిర్మొహమాటంగా చెక్ పెట్టాలని చెబుతున్నారు.జీతం రాగానే ఫస్ట్ చేయాల్సింది ఖర్చు కాదని, పొదుపు అని సూచిస్తున్నారు. సంపాదనలో 30 శాతం మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటి పొదుపు ఖాతాల్లో వేసేయాలి.ఆ తర్వాత మిగిలిన డబ్బుతోనే నెలవారీ బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. పక్కా బడ్జెట్ ప్లానింగ్ చేసి, అంతకు మించి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకూడదనే కఠిన నిబంధన పెట్టుకోవాలని సూచిస్తున్నారు.ఇలా ప్లాన్ చేస్తే చిన్న మార్పులతోనే ఆర్థిక భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పాటు చేసుకోవచ్చని సూచిస్తున్నారు.





# కామాఖ్యా దేవి ఆలయంలో సూర్య-జ్యోతిక ప్రత్యేక పూజలు.. వైరల్ అవుతున్న స్టార్ కపుల్ ఫోటోలు

కోలీవుడ్‌లో అత్యంత అభిమానాన్ని సంపాదించిన జంటల్లో సూర్య--జ్యోతిక జంటకు ప్రత్యేక స్థానం ఉంది. తెరపై తమ అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ జంట, నిజ జీవితంలోనూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యక్తిగత జీవితాన్ని, కెరీర్‌ను సమతూకంగా కొనసాగిస్తూ అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.ప్రస్తుతం ఈ స్టార్ కపుల్ కెరీర్ పరంగా కూడా మంచి జోష్‌లో ఉన్నారు. ఇటీవల సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోగా, జ్యోతిక ప్రధాన పాత్రలో నటించిన 'సిస్టం' సినిమా కూడా మంచి స్పందనను అందుకుంది. వరుస విజయాలతో ఫుల్ హ్యాపీగా ఉన్న ఈ జంట తాజాగా ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లారు. దీనిలో భాగంగా సూర్య, జ్యోతిక కలిసి అస్సాంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కామాఖ్యా దేవి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అక్కడ కొన్ని ప్రత్యేక ఫోటోలకు పోజులిచ్చారు. సాంప్రదాయ దుస్తుల్లో సూర్య, జ్యోతిక ఎంతో సింపుల్‌గా, ప్రశాంతంగా కనిపించారు. వీరిద్దరూ కలిసి దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. అభిమానులు కూడా ఈ ఫోటోలను పెద్ద ఎత్తున షేర్ చేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు. "ఎవర్‌గ్రీన్ జంట", "సక్సెస్ తర్వాత దైవ దర్శనం చాలా మంచి విషయం", "ఇద్దరూ చాలా అందంగా ఉన్నారు", "ఇదే నిజమైన పవర్ కపుల్" అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, సూర్య ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, జ్యోతిక కూడా పలు కీలక కథలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఒకవైపు సినీ ప్రయాణం, మరోవైపు కుటుంబ జీవితం రెండింటినీ సమతూకంగా కొనసాగిస్తున్న ఈ స్టార్ జంట మరోసారి వార్తల్లో నిలిచింది.



# రాయలసీమ యాసలో అఖిల్ కొత్త ప్రయోగం.. 'లెనిన్'తో భారీ హిట్‌పై ఫుల్ ఫోకస్!

అక్కినేని యువ హీరో అఖిల్ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత కీలకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్న 'లెనిన్' సినిమాతో బిజీగా ఉన్నాడు. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల విడుదలైన టీజర్ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రం ప్రత్యేకత ఏమిటంటే, కథ మొత్తం రాయలసీమ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనుండటం. ముఖ్యంగా చిత్తూరు ప్రాంత జీవనశైలి, అక్కడి పరిస్థితులు, స్థానిక సంస్కృతిని ప్రధానంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. కథలోని పాత్రల సహజత్వాన్ని ప్రేక్షకులకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో దర్శకుడు యాసకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని సమాచారం. సినిమాలో ప్రధాన పాత్రల సంభాషణలు పూర్తిగా రాయలసీమ యాసలోనే ఉండనున్నాయి. ముఖ్యంగా అఖిల్ పాత్రకు కూడా అదే తరహా డైలాగ్ డెలివరీ ఉండబోతోందట. టీజర్‌లో అఖిల్ వాయిస్ కొంత భిన్నంగా అనిపించినా, సినిమాలో మాత్రం ఆయన స్వరానికే రాయలసీమ యాసను జోడించేలా ప్రత్యేకంగా వర్క్ చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటివరకు తన కెరీర్‌లో ఎక్కువగా క్లాస్, అర్బన్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించిన అఖిల్‌కు ఇది పూర్తిగా కొత్త ప్రయోగంగా భావిస్తున్నారు. రాయలసీమ యాసలో డైలాగ్స్ చెప్పడం, స్థానిక భాషా శైలిని అలవాటు చేసుకోవడం వంటి అంశాలపై అఖిల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో అందాల భామ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. అఖిల్-భాగ్యశ్రీ జంట మధ్య వచ్చే ప్రేమ సన్నివేశాలు సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ చాలా సహజంగా వచ్చిందని, ముఖ్యంగా ఎమోషనల్ మరియు లవ్ ట్రాక్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని సమాచారం. ఇక అఖిల్ ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

# 'హల్లల్లల్లో'తో సోషల్ మీడియాలో పెద్ది మేనియా..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' ప్రమోషన్స్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్, తొలి రెండు పాటలు ప్రేక్షకుల్లో అంచనాలను పెంచగా.. ఇప్పుడు మూడో సాంగ్ 'హల్లల్లల్లో' వచ్చి సోషల్ మీడియాలో కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టింది. గత రెండు రోజులుగా ప్రోమోతోనే వైరల్ అయిన ఈ పాట.. తాజాగా పూర్తి వీడియో విడుదల కావడంతో మెగా అభిమానుల్లో మరింత జోష్ నింపింది. భోపాల్‌లో జరిగిన 'పెద్ది కీ ఆవాజ్' ఈవెంట్‌లో ఈ పాటను గ్రాండ్‌గా లాంచ్ చేస్తారని అభిమానులు భావించారు. అయితే అక్కడ ఆడియో వెర్షన్ మాత్రమే విడుదల చేశారు. దీంతో పూర్తి వీడియో కోసం ఆసక్తిగా ఎదురుచూసిన అభిమానులకు ఇప్పుడు మేకర్స్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. విడుదలైన కొద్ది సేపటికే ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి దూసుకెళ్లింది. "హల్లల్లల్లో... హల్లో హల్లల్లల్లో హల్లల్లో... బావ చీర చొక్కా చిక్కడిపోవాలో..." అంటూ సాగే లిరిక్స్ యూత్‌ను బాగా ఆకట్టుకుంటున్నాయి. రొమాంటిక్ టచ్‌తో పాటు మాస్ ఎనర్జీని కలిపి రూపొందించిన ఈ పాటలో రామ్ చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన స్టైలిష్ స్టెప్పులు, రా అండ్ రస్టిక్ లుక్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి. ఈ పాటకు ప్రముఖ రచయిత అనంత్ శ్రీరామ్ సాహిత్యం అందించగా, గాయని రక్షిత సురేష్ తన గాత్రంతో ప్రత్యేకమైన ఫీల్ తీసుకొచ్చారు. కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కంపోజ్ చేసిన డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్, జాన్వీ కపూర్ కెమిస్ట్రీ పాటకు మరో ప్లస్ పాయింట్‌గా నిలిచింది. ఇక 'పెద్ది' సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. 'చికిరి చికిరి', 'రయ్ రయ్ రా రా' పాటల నుంచి ట్రైలర్ వరకు ప్రతి అప్డేట్ అభిమానులను ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ సినిమా క్లైమాక్స్‌పై చిత్రబృందం పదే పదే ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు రూపొందించిన ఈ ముగింపు సన్నివేశం ప్రేక్షకులకు భారీ సర్‌ప్రైజ్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ప్రమోషన్స్ విషయంలో కూడా చిత్రబృందం ఎక్కడా తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా ప్రత్యేక ఈవెంట్లు నిర్వహిస్తూ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేస్తున్నారు. బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, విజయనగరం, హైదరాబాద్ నగరాల్లో వరుసగా భారీ ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్లాన్ చేశారు.

# 'రౌడీ జనార్ధన'లో 'కన్నప్ప' బ్యూటీ స్పెషల్ సాంగ్!



టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, టాలెంటెడ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రౌడీ జనార్ధన'. ప్రముఖ నిర్మాత దిల్ రాజు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాలో మాస్ ఆడియన్స్‌ను ఊపేసే ఒక అదిరిపోయే స్పెషల్ సాంగ్ ఉండబోతోందట. దర్శకుడు రవి కిరణ్ ఈ పాట కోసం ఒక పవర్‌ఫుల్ సిచువేషన్‌ను సిద్ధం చేయగా, అందులో విజయ్ పక్కన స్టెప్పులేసేం దుకు 'కన్నప్ప' ఫేమ్ బ్యూటీ ప్రీతి ముకుందన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెతో చర్చలు నడుస్తున్నాయని, అంతా అనుకూలిస్తే రౌడీ హీరోతో కలిసి ప్రీతి ముకుందన్ మాస్ డ్యాన్స్‌తో థియేటర్లలో రచ్చ చేయడం ఖాయమని అంటున్నారు. ఈ సినిమాపై అంచనాలు పెంచే మరో క్రేజీ అప్‌డేట్ ఏంటంటే.. టాలీవుడ్ యాంగ్రీ మ్యాన్, సీనియర్ హీరో రాజశేఖర్ ఈ చిత్రంలో ఒక అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నారు. ఆయన క్యారెక్టర్‌ను మునుపెన్నడూ చూడని విధంగా, ఎంతో వైవిధ్యంగా డిజైన్ చేశారట. ముఖ్యంగా రాజశేఖర్ సరికొత్త లుక్ ఈ సినిమాకే పెద్ద హైలైట్‌గా నిలుస్తుందని ఇండస్ట్రీ టాక్. మహానటి కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఓ వైపు 'రణబాలి' సినిమా చేస్తూనే, మరోవైపు ఈ 'రౌడీ జనార్ధన' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కమర్షియల్ సక్సెస్ అందుకోవాలని విజయ్ దేవరకొండ పూర్తి కసిగా ఉన్నాడు.

# బాక్సాఫీస్ వద్ద 'దృశ్యం 3' సునామీ..

**కేవలం 3 రోజుల్లోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో మోహన్‌లాల్!**

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సెన్సేషనల్ డైరెక్టర్ జీతు జోసెఫ్ కాంబినేషన్‌లో వచ్చిన మోస్ట్ అవేటెడ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. థియేటర్లలోకి వచ్చిన కేవలం మూడు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్ల మార్కును దాటేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం మూడో రోజు ముగిసే సమయానికి ఈ చిత్రం గ్లోబల్ వైడ్‌గా ఏకంగా రూ. 117.17 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించడమే కాకుండా, మలయాళ చిత్ర పరిశ్రమలో అత్యంత వేగంగా వంద కోట్ల క్లబ్‌లో చేరిన రెండవ సినిమాగా సరికొత్త చరిత్ర లిఖించింది. బాక్సాఫీస్ లెక్కల విషయానికి వస్తే ఇండియాలో ఈ సినిమా ఇప్పటివరకు రూ. 40.60 కోట్ల నెట్ వసూలు చేయగా, మొదటి రోజుతో పోలిస్తే శని, ఆదివారాల్లో కలెక్షన్లు భారీగా పుంజుకున్నాయి. విదేశాల్లో కూడా ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతుండటంతో ఓవర్సీస్ మార్కెట్‌లోనే ఏకంగా రూ. 70 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఎప్పటిలాగే మలయాళ వెర్షన్ రూ. 11.65 కోట్ల నెట్ కలెక్షన్లతో టాప్‌లో నిలవగా, తెలుగు, తమిళ, కన్నడ వెర్షన్లు కూడా మంచి వసూళ్లను సాధిస్తున్నాయి. మిశ్రమ సమీక్షలు వచ్చినప్పటికీ జార్జ్‌కుట్టి పాత్రపై ఉన్న క్రేజ్ ప్రేక్షకులను థియేటర్లకు పరుగులు పెట్టిస్తుండటంతో కేరళలో దాదాపు 67% పైగా అక్యుపెన్సీతో థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. ఈ ఘన విజయంపై మోహన్‌లాల్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, గడిచిన 13 ఏళ్లుగా జార్జ్‌కుట్టి కుటుంబంపై ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ, నమ్మకానికి చేతులెత్తి మొక్కుతున్నానని అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబావూర్ నిర్మించిన ఈ సినిమాలో మీనా, అన్సిబా, ఎస్తేర్ అనిల్ కీలక పాత్రలు పోషించారు.




The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.